

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL    ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 27 మే 2021 సంపుటి : 02 సంచిక :312 పేజీలు : 4 వెల : రూ 3-00

## వైయస్సార్ బీమా సహాయం అందజేసిన పాల శ్రీనివాస్ రెడ్డి

ఎమ్మిగనూరు స్థానిక ఎమ్.ఎస్ నగర్ 31వ వార్డు నందు ఎం చిరంజీవి అనే వ్యక్తి గత సంవత్సరం మే నెలలో అనారోగ్య కారణంతో మరణించాడు. ఆ వ్యక్తికి వైయస్సార్ బీమా నమోదు కావడం చేత తక్షణ సహాయం కింద పదివేల రూపాయలను ఆయన భార్య బి రాధికకు కౌన్సిలర్ బి.శ్రావణి,వార్డ్ ఇంచార్జ్ పాల శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ మల్లికార్జున, సంక్షేమ కార్యదర్శి ఉరుకుందు, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ కుమార్, శానిటేషన్ సెక్రెటరీ రాజశేఖర్, ఎమినిటీస్ సెక్రెటరీ ఎం భాస్కర్, రెవిన్యూ సెక్రెటరీ నాగేంద్రమ్మ, వార్డు వాలంటరీలు ప్రగతి, ద్రాక్షయని తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల వైపే..మోడీ చూపు



హైదరాబాద్ , మే 26, (న్యూస్ పల్స్) రకే రారు మహానుభావులు అంటారు. అలాగే రాజకీయ నాయకుల ఆలోచనలు కూడా ఊరికే ఉండవు. వారు ఎవరితో ఎలా ఉంటారో ఆ వైఖరిని బట్టే ఫ్యూచర్ పాలిటిక్స్ ని ఇట్టే అర్ధం చేసుకోవచ్చు. సౌత్ లో బీజేపీకి చోటు లేదని తాజాగా జరిగిన అయిదు రాష్ట్రాల ఎన్నికలు గేటు వేసేశాయి. అయినా సరే బీజేపీకి సౌత్ మీద కొత్త ఆశలు చాలానే ఉన్నాయి. అవి రాజకీయ రాయబేరాలకు అనుకూలమైనవి. తాను ఉంటేనేంటి, తనవారు ఉంటేనేంటి అన్న నిబ్బరం కూడా వాటిలో కనిపిస్తుంది.ఉభయ తెలుగు రాష్ట్రాల రాజకీయాన్ని చూసుకుంటే కనుక అటు కేసీయార్ కైనా, ఇటు జగన్ కైనా ప్రధాన శత్రువు కాంగ్రెస్ అన్న సంగతి తెలిసిందే. కేసీయార్ కి అయితే ప్రధాన ప్రతిపక్షంగా కూడా కాంగ్రెస్ ఉండి సవాల్ చేస్తోంది. అందువల్ల కాంగ్రెస్ కి ఆయన ఎపుడూ ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ కేంద్రంలో మద్దతు ఇవ్వలేరు అన్నది తెలిసిందే. ఇక ఏపీలో జగన్ కి చంద్రబాబు ప్రత్యర్ధి అయినా జాతీయ స్థాయిలో చూస్తే కాంగ్రెస్ రాకూడదు అనే కోరుకుంటారు. కాంగ్రెస్ మళ్లీ పుంజుకుంటే ఏపీలో తన ఓటు బ్యాంక్ చెల్లాచెదురు అవుతుంది అన్నదే జగన్ భయం అని అంటారు.ఈ రకమైన రాజకీయ సమీకరణలు సహజంగా బీజేపీకే లాభంగా ఉంటాయి అన్నది నిజం. కేంద్రంలో బీజేపీ ఉన్నా తప్పు లేదు కానీ కాంగ్రెస్ వస్తే కొంప కొల్లేరే అన్నది ఇద్దరు తెలుగు వల్లభుల ఆలోచన అని చెబుతారు. ఈ రకమైన అంచనాలు ఉండబట్టే మోడీ కూడా తెలుగు రాష్ట్రాల అధినేతల పట్ల కాస్తా సానుకూలంగా ఉంటారు అంటారు. కేసీయార్ సైతం బయటకు బీజేపీని విమర్శిస్తున్నా కేంద్రంతో మాత్రం ఆచీ తూచీ అన్నట్లుగానే ఉంటారు. జగన్ ఎటూ మోడీకి సపోర్ట్ చేస్తారు అన్నది తెలిసిందే. దీంతో మోడీకి తెలుగు రాష్ట్రాల విషయంలో రాజకీయ ధీమా బాగానే ఉందని అంటారు.కరోనా వేళ వివిధ రాష్ట్రాల సీఎంలతో మోడీ మాట్లాడుతున్నారు. ఆ మీదట వారు మోడీ సర్కార్ మీద విమర్శలు కూడా చేస్తున్నారు. ఒక్క తెలుగు రాష్ట్రాల సీఎంలు మాత్రం మోడీతో బాగా కనెక్ట్ అవుతున్నారు. మోడీ జగన్ తో మాట్లాడినా కేసీయార్ తో చర్చించినా అయన పట్ల ఈ ఇద్దరూ తన సానుకూలతను కూడా వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఏపీకి కేంద్రం సాయం బాగా చేస్తోంది కాబట్టే జగన్ వెనకేసుకువస్తున్నారు అని జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ అనడం ఈ సందర్భంగా గమనార్హం. ఇక కేసీయార్ కూడా ప్రధాని తాను చెప్పిన అన్ని విషయాలను సావధానంగా విన్నారు అని చెప్పుకున్నారు. మొత్తానికి 2024 లో కాంగ్రెస్ కూటమి ఒక వైపు మోడీ మరో వైపు ఉంటే తటస్థంగా అయినా కేసీయార్ ఉంటారు కానీ కాంగ్రెస్ కి మద్దతు ఇవ్వరు అని చెబుతారు. ఇక జగన్ అయితే కాంగ్రెస్ ఊసే తలవరు. కాబట్టి మోడీకి ఈ టైమ్ లో తెలుగు చూపు తెలివితో కూడిన చూపుగానే అంటున్నారు.

## వైద్యులు, వైద్య సిబ్బందికి సీఎం జగన్ ధన్యవాదాలు



అమరావతి: 'వైద్యులు, వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు అసమానం.. ఒక తల్లి మాదిరి సేవలు చేస్తున్న మీకు ధన్యవాదాలు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రాణాంతకం అని తెలిసినా రోగులకు సేవలు అందిస్తున్నారని వైద్యులు, వైద్య సిబ్బంది సేవలను కొనియాడారు. ఎలాంటి సహాయ, సహకారం కావాలన్నా అందించేందుకు సిద్ధమని ప్రకటించారు. వైద్యులు, వైద్య సిబ్బందితో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం సీఎం జగన్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులు, వైద్య సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కలెక్టర్లతో జరిగిన సమావేశంలో వైఎస్సార్ జలకళ, ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాల ప్రగతిని సీఎం జగన్ తెలుసుకున్నారు.సమావేశంలో సీఎం వైఎస్ జగన్ ఈ విధంగా మాట్లాడారు. 'కోవిడ్‌పై పోరాటంలో నిమగ్నమైన సిబ్బందికి అభినందనలు. మన రాష్ట్రానికి మహా నగరాలు లేవు, అంత పెద్ద మౌలిక సదుపాయాల్లేవు కానీ.. గట్టి కృషి ద్వారా కోవిడ్‌పై పోరాటం చేస్తున్నారు. వైద్యులు, నర్సులు, వలంటీర్లు, ఆశా కార్యకర్తలు, పారిశుద్ధ సిబ్బందితో పాటు.. ప్రతి ఒక్కరూ అద్భుతంగా పనిచేస్తున్నారు. కొద్ది రోజులుగా జిల్లాల్లో కేసులు తగ్గుతున్నాయి. ఇది సానుకూల పరిస్థితి. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు ఎక్కువగా సారించాలి. కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. కరోనా సోకినవారిలో 70 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందిస్తున్నాం. 50 శాతం బెడ్లు కచ్చితంగా ఆరోగ్యశ్రీ పేషెంట్లు ఇవ్వాలి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలు కచ్చితంగా అమలు కావాలి. ఆరోగ్యమిత్రలు, సీసీ కెమెరాలు సమర్థవంతంగా పనిచేయాలి' అని వైద్యులు, వైద్య సిబ్బందికి సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు.'అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ఆస్పత్రులపై 24 గంటల్లో చర్యలు తీసుకోవాలి. ఇది మహమ్మారి సమయం, ప్రతి పేదవాడికి సేవలు చేయాల్సిన సమయం. 104 కాల్‌సెంటర్ వన్ స్టాప్ సొల్యూషన్‌గా పెట్టాం. మన బంధువులే మనకు ఫోన్ చేస్తే ఎలా స్పందిస్తామో.. 104కు ఎవరైనా ఫోన్ చేస్తే అలాగే స్పందించాలి. జర్మన్ హేంగర్లపై కలెక్టర్లు, జేసీలు దృష్టి పెట్టాలి. ఆక్సిజన్ ఎయిర్ కండిషన్ పెట్టాలి, శానిటేషన్ బాగుండాలి. రోగులకు మంచి ఆహారం అందించాలి. ఆక్సిజన్ సరఫరా 330 టన్నుల నుంచి 600 టన్నుల సామర్థ్యానికి పెంచాం. కనీసం రెండ్రోజులకు సరిపడా నిల్వలను అందుబాటులో ఉంచాం. ఆక్సిజన్ వినియోగంపై ఎప్పటికప్పుడు ఆడిటింగ్ జరగాలి. ప్రతి ఆస్పత్రిలో ఆక్సిజన్ నిల్వలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలి. రెమ్‌డెసివిర్ ఇంజక్షన్లు బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు రెమ్‌డెసివిర్ ఇంజక్షన్లు ఇస్తున్నాం' అని సీఎం వైఎస్ జగన్ వివరించారు.అనంతరం వైఎస్సార్ అర్బన్, రూరల్ హెల్త్ క్లినిక్స్, గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలపై సీఎం వైఎస్ జగన్ సమీక్షించారు. అనంతరం ఖరీఫ్ సన్నద్ధత, ఎరువులు, విత్తనాల అందుబాటుపై అధికారులతో సీఎం జగన్ చర్చించారు. ఖరీఫ్‌లో వ్యవసాయ రుణాలపై సమీక్షించారు. వీటితో రాష్ట్రంలో కోవిడ్ నివారణ చర్యలపై అధికారులకు సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మంత్రులు ఆళ్లనాని, బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, డీజీపీ గౌతమ్ సవాంగ్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.జులై 8న వైఎస్ఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఆర్బీకేలు ప్రారంభిస్తామని సీఎం వెల్లడించారు. కొత్తగా నిర్మాణం చేపట్టనున్న మెడికల్ కాలేజీలకు 30న శంకుస్థాపన చేస్తామన్నారు. వచ్చే ఉగాది నాటికి పట్టణాలు, నగరాల్లో మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరలకే ప్లాట్లు అందిస్తామన్నారు. దాదాపు 17 వేల ఎకరాలు అవసరం అవుతుందని అంచనా వేస్తున్నామన్నారు. రకరకాల కేటగిరిల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భూముల సేకరణ జరుగుతుందన్నారు.

## సున్నపురాళ్ల కృషి నా ఆకాంక్షలకు ప్రతిబింబం: ఉపరాష్ట్రపతి



న్యూఢిల్లీ: తెలుగు భాషా పరిరక్షణకు విశేషంగా కృషి చేస్తున్న సున్నపురాళ్ల శ్రీనివాసులుపై ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అభినందనల వర్షం కురిపించారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం లేఖను విడుదల చేసింది. ఏపీలోని అనంతపురం జిల్లా కదిరికి చెందిన తెలుగు భాషా ఉపాధ్యాయులు శ్రీనివాసులు కుటుంబ సభ్యుల తెలుగు భాషాభిమానానికి ఆయన ఫిదా అయ్యారు.తెలుగు సాహితీ దిగ్గజాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయాలనే సంకల్పంతో 'తెలుగు సాహితీ మూర్తుల ముఖ చిత్రాలు - రేపటితరం కోసం' పేరిట వారు చేసిన కృషి అభినందనీయమని ఉపరాష్ట్రపతి తన లేఖలో పేర్కొన్నారు. సాహితీవేత్తల చిత్రాలను సేకరించి, అందరికీ అందుబాటులోకి తీసుకురావడం గొప్ప విషయమన్నారు. వారి చిత్రాలను సేకరించి, సాహితీవేత్తల జీవిత కాలాలను, విశేషాలను, రచనలను పొందుపరిచి, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. 'తెలుగు సాహితీ కాలచక్రం' పేరిట ఆయా మాసాల్లో పుట్టిన తెలుగు సాహితీ వేత్తల చిత్రాలతో క్యాలెండర్‌ను తయారు చేసిన విధానానికి వారు చూపిన చొరవ తన ఆకాంక్షను ప్రతిబింబించే విధంగా ఉందన్నారు. ఈ బృహద్ కార్యక్రమంలో పాలుపంచుకున్న సున్నపురాళ్ల శ్రీనివాసులు సతీమణి వజ్రాల యశోద, తనయుడు సున్నపురాళ్ల షణ్ముఖతో పాటు వారికి సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు అని లేఖలో ఉపరాష్ట్రపతి తెలిపారు.

### జగన్‌రెడ్డి ఏమాత్రం సిగ్గులేకుండా ప్రవర్తిస్తున్నారు: చంద్రబాబు

అమరావతి: రాష్ట్రంలో కొందరు పోలీసులు వైసీపీ నాయకుల్లా పనిచేస్తున్నారని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ రఘురామను కొట్టినందుకు సీబీఐ విచారణ ఎదుర్కుంటోందని అన్నారు. సీఎం జగన్‌రెడ్డి ఏమాత్రం సిగ్గులేకుండా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. జగన్‌ను నమ్ముకున్నవాళ్లు ఇప్పటికే జైలుకు వెళ్లొచ్చారని.. పోలీసులకూ ఇదే గతి పడుతుందని ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని, దౌర్జన్యాలను వడ్డీతో సహా చెల్లించేరోజు దగ్గరలోనే ఉందని చంద్రబాబు అన్నారు.

## అల్లకల్లోలం సృష్టిస్తున్న యాస్ తుఫాన్

అమరావతి: ఒడిశా–బెంగాల్ తీరంపై అతి తీవ్ర యాస్ తుఫాన్ విరుచుకుపడుతోంది. ఒడిషాలోని భద్రక్ జిల్లాలో ఉన్న ధమ్ర పోర్టుకు సమీపంలో తీరాన్ని తాకిన యాస్ తుఫాన్.. మధ్యాహ్నం తర్వాత ధమ్రా పోర్టు - బాలాసోర్ మధ్య తీరం దాటనుంది. ఈ తుఫాన్ ఒడిశాలోని 9 జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పటికే సంబంధిత 9 జిల్లాలల్లో భారత వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. మరోవైపు తుఫాన్ తాకిడితో పశ్చిమ బెంగాల్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ధమ్ర పోర్టులో 10వ నంబరు ప్రమాద హెచ్చరిక జారీచేసింది. తుఫాన్ ప్రభావంతో గంటకు 150 -160 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. దీనివల్ల 20 సెం.మీకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది.ఉత్తరాంధ్రకు అతి తీవ్ర యాస్ తుఫాన్ ముప్పు దాదాపు తప్పింది. గంటకు 50 కి.మీ వేగంతో ఉత్తర కోస్తాంధ్రలో బలంగా గాలులు వీస్తున్నాయి. నెల్లూరు దుగరాజపట్నం నుంచి బారువ వరకు తీరం వెంబడి సముద్రం అలజడిగా ఉంటుందని ఏపీ విపత్తుల నిర్వహణశాఖ పేర్కొంది. సముద్రంలో అలలు 2.5 నుంచి 5 మీటర్ల ఎత్తులో అలలు ఎగసి పడతాయని, సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున.. రేపటి వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జరీ చేశారు. తీరప్రాంత, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.



## దేశంలో భారీగా తగ్గిన కరోనా కేసులు..

న్యూఢిల్లీ మే 26 దేశంలో కరోనా తగ్గుముఖం పడుతున్నది. మరోసారి మూడు లక్షలకు దిగువన పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అయితే, మరణాలు మాత్రం ఆందోళనకరంగానే ఉన్నాయి. వరుసగా రెండో రోజు నాలుగువేలకుపైగా మరణాలు రికార్డయ్యాయి. గడిచిన 24 గంటల్లో 2,08,921 కొవిడ్ కేసులు నమోదయ్యాయని కేంద్ర కుటుంబ ఆరోగ్యమంత్రిత్వ శాఖ బుధవారం తెలిపింది. కొత్తగా 2,95,955 మంది బాధితులు వైరస్ నుంచి కోలుకోగా.. 4,157 మంది మహమ్మారి బారినపడి మృత్యువాతపడ్డారు. కొత్తగా నమోదైన కేసులతో దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 2,71,57,795కు పెరిగాయని, ఇప్పటి వరకు 2,43,50,816 మంది కోలుకున్నారు.వైరస్ బారినపడి మొత్తం 3,11,388 మంది కన్నుమూశారు. ప్రస్తుతం దేశంలో 24,95,591 యాక్టివ్ కేసులున్నాయి. మరో వైపు టీకా డ్రైవ్‌లో భారత్ మరో మైలురాయిని దాటింది.

## సెప్టెంబర్ నాటికి కోవాగ్జిన్‌కు డబ్ల్యూహెచ్‌వో ఆమోదం..




న్యూఢిల్లీ: భారత్ బయోటెక్ కంపెనీకి చెందిన కోవాగ్జిన్ టీకాకు ఇంకా ప్రపంచ ఆరోగ్య సంస్థ వద్ద ఆమోదం దక్కలేదు. దీంతో విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులు కొంత ఆందోళనకు గురవుతున్నారు. డబ్ల్యూహెచ్‌వో నుంచి ఆమోదం దక్కకపోవడం వల్ల.. అనేక దేశాలు ఆ టీకాను తమ లిస్టులో చూపించడం లేదు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, ఈయూ దేశాలు ఇంకా కోవాగ్జిన్ టీకాను తమ ఆమోదిత జాబితాలో చేర్చలేదు. వివిధ దేశాల్లో ఉన్న టాప్ యూనివర్సిటీలు.. డబ్ల్యూహెచ్‌వో ఆమోదం తెలిపిన టీకాలు తీసుకున్నవారికే అనుమతి ఇస్తున్నారు. కోవాగ్జిన్ అప్రూవ్డ్ లిస్టులో లేదని, దీని వల్ల విద్యార్థులు హోటల్ క్వారెంటైన్‌లో ఉండాల్సి ఉంటుందని, 14 రోజుల పాటు హోటల్‌లో ఉండడం అంటే చాలా ఖరీదైన అంశం అవుతుందని లైమ్‌రిక్ వర్సిటీ అడ్వైజర్ సౌమ్యా పాండే తెలిపారు. డబ్ల్యూహెచ్‌వో ఆమోదం పొందిన జాబితాలో ఫైజర్, మోడెర్నా, కోవీషీల్డ్ టీకాలు మాత్రమే ఉన్నాయి.కోవాగ్జిన్‌కు ఆమోదం లభించే ప్రక్రియ కొనసాగుతున్నదని, 60 దేశాల్లో ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయని, అమెరికా, బ్రెజిల్, హంగేరీ దేశాలు తమ వ్యాక్సిన్‌కు ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకుంటున్నట్లు భారత్ బయోటెక్ ఓ ప్రకటనలో పేర్కొన్నది. అత్యవసర వినియోగం జాబితాను జెనీవాలోని డబ్ల్యూహెచ్‌వోకు సమర్పించామని, జూలై లేదా సెప్టెంబర్ లోగా తమ టీకాకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి ఆమోదం దక్కుతుందని భారత్ బయోటెక్ సంస్థ పేర్కొన్నది. టీకా అనుమతి కోసం డబ్ల్యూహెచ్‌వోకు సుమారు 90 శాతం డాక్యుమెంట్ పేపర్లను సమర్పించినట్లు భారత్ బయోటెక్ తెలిపింది. జూన్

## ఏపీలో చిరంజీవి ఆక్సిజన్ బ్యాంకులు: సంతోషంగా ఉంది: మెగాస్టార్



ఆక్సిజన్ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కరోనా బాధితుల కోసం మెగాస్టార్ చిరంజీవి నడుంబిగించారు. ఇప్పటికే బాధితులను ఆదుకునేందుకు చిరంజీవి ఆక్సిజన్ బ్యాంకులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు తొలి విడతగా గుంటూరు, అనంతపురం జిల్లాలకు ఆక్సిజన్ బ్యాంకులు ఎర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ నుంచి ఆక్సిజన్ సిలిండర్లను తరలిస్తున్న వీడియోను చిరంజీవి ట్విటర్‌లో షేర్ చేశారు.'అనుకున్న ప్రకారం వారం రోజుల్లోనే వందల సంఖ్యల్లో ఆక్సిజన్ సిలిండర్లు, కాన్‌సన్‌ట్రేటర్లు సంపాదించాం. అనంతపురం, గుంటూరు జిల్లాల్లో బుధవారం నుంచి 'చిరు ఆక్సిజన్ బ్యాంక్' సేవలు ప్రారంభమవుతున్నాయి. గురువారం నుంచి ఖమ్మం, కరీంనగర్ జిల్లాలతో పాటు మరో ఐదు జిల్లాల్లో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ ఆక్సిజన్ సిలిండర్లు సంపాదించడానికి రామ్‌చరణ్ కూడా ఎంతో కృషి చేశాడు. నాకెంతో సంతోషంగా ఉంది. సమయానికి ఆక్సిజన్ దొరక్క ఇక ఎవరు ఇబ్బందిపడకూడదు' ఆయన చెప్పుకొచ్చారు.

## వైఎస్ జగన్ బెయిల్ రద్దు కేసు

### విచారణ జూన్ 1 కి వాయిదా

అమరావతి ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్రెడ్డి బెయిల్ రద్దు కేసు విచారణ జూన్ 1కి వాయిదా పడింది. కౌంటర్ దాఖలుకు జగన్, సీబీఐ అధికారులు మరింత గడువు కోరడంతో చివరి అవకాశం ఇస్తూ సీబీఐ కోర్టు విచారణను మరోసారి వాయిదా వేసింది. జగన్ బెయిల్ రద్దు చేయలంటూ ఎంపీ రఘు రామ కృష్ణం రాజు దాఖలు చేసిన పిటిషన్పై బుధవారం విచారణ జరిగింది. లాక్డౌన్ తదితరుల కారణాల వల్ల కౌంటర్ దాఖలు చేయలేదని జగన్ తరపు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. మరోవైపు తన క్లయింట్ సీబీఐ నుంచి ఇంకా సూచనలు రాలేదని సీబీఐ న్యాయవాదులు కోర్టుకు తెలియజేశారు. దీనిపై రఘురామ తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేసారు. ప్రతివాదులకు జరిమానా విధించాలని కోరారు. అయితే కౌంటర్ దాఖలు చేసేందుకు చివరి అవకాశం ఇస్తున్నామని. జూన్ 1న కౌంటర్ దాఖలు చేయకపోతే నేరుగా విచారణ చేపడతామని సీబీఐ కోర్టు స్పష్టం చేసింది.

# సంపాదకీయం

గురువారం 27 మే 2021

## అయ్యో పాపం..... రాందేవ్ బాబా

యోగా గురు బాబా రాందేవ్ ను హెచ్చరిస్తూ కేంద్రమంత్రి హర్షవర్ధన్ లేఖ రాయడం సంచలనం కలిగిస్తోంది. నిన్నామొన్నటివరకూ బీజేపీకి రాందేవ్ ప్రధాన మద్దతుదారు. గత సంవత్సరం కరోనా విజృభించేంతవరకూ సంబంధాలు సజావుగానే ఉన్నాయి. కానీ కరోనాను అరికడతానంటూ తమ ఆయుర్వేద సంస్థ ద్వారా తయారు చేసిన మందులకు ప్రత్యేక గుర్తింపు కోరడంతోనే రాందేవ్ కు చిక్కులు వచ్చి పడ్డాయి. శాస్త్రీయమైన నిర్ధారణ లేకుండానే తమ మందులు కరోనాను తగ్గిస్తాయంటూ తొలుత ఆయన ప్రచారం మొదలు పెట్టారు. దీనిపై రకరకాల ఫిర్యాదులు, చివరికి న్యాయస్తానంలో కేసుల స్థాయికి వ్యవహారం ముదిరింది. దాంతో రోగం నివారణ అనే ప్రచారాన్ని విరమించుకుని, రోగనిరోధకతకు తమ మందులు ఉపయోగపడతాయంటూ రాందేవ్ మాట మార్చాల్సి వచ్చింది. అయితే ఈ మొత్తం తతంగంలో కేంద్రం తనకు మద్దతుగా నిలవలేదని బాబా అలకబూనారు. అప్పట్నుంచి సంబంధాలు సజావుగా లేవు. తాజాగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఫిర్యాదుతో వివాదం పరాకాష్టకు చేరింది. ఫలితమే ఘాటుగా రాందేవ్ కు కేంద్రం నుంచి సంకేతాలు అందాయి. ఒకవేళ అదుపు తప్పితే చట్టపరమైన చర్యలు తప్పవనే సంకేతాలూ లేఖలో అంతర్లీనంగా దాగి ఉన్నాయి. యోగాభ్యాసాల ద్వారా ప్రఖ్యాతి తెచ్చుకున్న రాందేవ్ బాబా తర్వాత కాలంలో ఆయుర్వేదాన్ని తన ఆర్థిక వనరుగా మార్చుకున్నారు. వేల కోట్ల రూపాయల సామ్రాజ్యాన్ని సృష్టించారు. యోగాలో తనకు లక్షల మంది ఫాలోవర్లు ఉండటంతో ప్రచారం సులభతరమైంది. సైద్ధాంతికంగానూ బీజేపీకి చేరువయ్యారు. కేంద్రంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత వేగంగా , సులభంగా తన వ్యాపారం వృద్ధి చెందుతుందని ఆశించారు. అయితే బాబా రాందేవ్ చంచల స్వభావం తెలిసిన కేంద్రం నిరంతరం అప్రమత్తంగా ఉంటోంది. ఆచితూచి వ్యవహరించింది. దాంతో ఆయన ఎత్తుగడలు పారలేదు. ఒక దశలో బీజేపీ పట్ల తీవ్రమైన అసంతృప్తినే బాబా ప్రకటించారు. కానీ కేంద్రం తలచుకుంటే తన వ్యాపార మూలాలకే ఎసరు వస్తుందని గ్రహించి మళ్లీ తర్వాత సర్దుకున్నారు. తాజాగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాందేవ్ బాబాపై ధ్వజమెత్తడంతో కేంద్రం మరోసారి ఆయనకు హెచ్చరికలు జారీ చేసింది. అయితే కేంద్రం కూడా రాందేవ్ జోలికి నేరుగా వెళ్లడానికి ఇష్టపడటం లేదు. బాబాకు ఇప్పటికే సుస్థిరమైన వ్యాపార సామ్రాజ్యం , ఆయనను విశ్వసించే కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. అందువల్ల పనిగట్టుకుని ఆయనపై చర్యలకు పూనుకోకపోవచ్చు. అయితే తమ కనుసన్నల్లో ఉండేలా చూసుకునేందుకే కేంద్రం ప్రయత్నిస్తుంది. అల్లోపతి వైద్యం అంతా హంబగ్. కరోనా విషయంలో సాధించిందేమీ లేదంటూ బాబా రాందేవ్ చేసిన వ్యాఖ్యలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆగ్రహానికి కారణమయ్యాయి. బాబా వ్యాఖ్యలు నిజంగా డాక్టర్ల నైతిక స్త్యైర్యాన్ని దెబ్బతీసేవని అంగీకరించాల్సిందే. కానీ ప్రజల్లోనూ అదే రకమైన భావనలు నెలకొంటున్నాయి. కరోనాకు రోజుకో రకమైన ట్రీట్ మెంట్ ను చెబుతున్నారు. రెమ్ డెసివర్ సర్వ రోగ నివారిణి అన్నట్లుగా తొలుత అల్లోపతి వైద్యులు ఆచరించారు. ప్రస్తుతం అది పెద్దగా పనికిరాదంటున్నారు. ఈలోపుగానే వేల కోట్ల రూపాయల దోపిడీ, బ్లాక్ మార్కెటింగ్ జరిగిపోయింది. ప్లాస్మా థెరపీలంటూ కొంతకాలం హడావిడి చేశారు. ఇప్పుడు వాటివల్ల పెద్ద ప్రయోజనం లేదంటున్నారు. అలాగే ఆవిరిపట్టడం, స్టెరాయిడ్ల వంటి అన్ని విషయాల్లోనూ పరస్పర వైరుధ్యమైన చికిత్సలను అల్లోపతి ఆచరిస్తోంది. అనుసరిస్తోంది. తాజాగా అల్లోపతి వైద్యంలో తీవ్రత కారణంగానే బ్లాక్ ఫంగస్ వస్తుందనే కొత్త నిర్ధారణలు వస్తున్నాయి. అంటే కరోనా చికిత్స విషయంలో అల్లోపతిలో కూడా శాస్త్రీయత లేదనే అర్థం చేసుకోవాలి. బాబా రాందేవ్ విమర్శించారన్న మాట పక్కన పెడితే సామాన్యుల లోనూ అల్లోపతిపై అనుమానాలు తలెత్తుతున్నాయి. బాబా మాటల పట్ల అంతగా బాధ పడిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీపై ఎందుకు స్పందించడం లేదో అర్థం కాదు. పేదలకు నిర్దిష్ట ఛార్జీలు మించకుండా వైద్యం అందించేందుకు ఐఎంఎ తీసుకున్న చర్యలేమిటో తెలియదు. విమర్శలకు బాధ పడేముందు ఆత్మవిమర్శ కూడా అవసరమే. కరోనా సమయంలో నెల్లూరుజిల్లా ఆనందయ్య ఆయుర్వేదానికి విపరీతమైన గిరాకి ఏర్పడింది. ప్రజలు ప్రభుత్వ వైద్యం, ప్రయివేటు దోపిడీని తట్టుకోలేని పరిస్తితుల్లో ఉచితంగా లభించే మందుపై ఆశగా ఎదురు చూడటం తప్పు కాదు. పైపెచ్చు వైద్యంపై విశ్వాసం ప్రజలలో మూడో వంతు రోగాన్ని తగ్గించేస్తుంది. ఇంతవరకూ అల్లోపతిలో ఏమేం మందులు, ఏ పాళ్లలో వాడటం వల్ల రోగం తగ్గుతుందో ఎవరికీ తెలియదు. అదే ఆనందయ్య మందులో ఏమేం వాడతారో ప్రజలందరికీ తెలిసిన మూలికలే. అందువల్ల వాటిపై విశ్వాసం పెంచుకుంటున్నారు. చుట్టూ చీకటిలో కలుగుతున్న చిరునమ్మకం వారికి ప్రాణం పోస్తోంది. మందులోని మహత్తరమైన మూలికలు ఎలా పనిచేస్తున్నాయో నిపుణులే తేల్చాలి. అంతవరకూ పేద ప్రజలకు పెన్నిధిగానే దీనిని భావించాలి. ఇక్కడ కూడా మాబ్ సైకాలజీ, మాస్ హిస్టీరియా ప్రవేశించకుండా తగు జాగ్రత్తలతో ప్రజలకు కనీసం ఈ మందు అయినా అందేలా చూడటం ప్రభుత్వ కర్తవ్యం. వీలైనంత తొందరగా దీనిపై శాస్త్రీయ నిర్ధారణ చేయాలి.

## గ్రూపు రాజకీయాలు.. ఆధిపత్య పోరు

విజయవాడ, మే 26, (న్యూస్ పల్స్) ఏపీలో అధికార వైసీపీలోని చాలా నియోజకవర్గాల్లో గ్రూపు రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరు మామూలుగా లేదు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ గ్రూపు రాజకీయాలే పార్టీకి దెబ్బేశాయి. ఇప్పుడు వైసీపీలోనూ అదే తంతు నడుస్తోంది. విచిత్రం ఏంటంటే నాడు టీడీపీ కేడర్ కొన్ని నియోజకవర్గాల్లో ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరుతో ఎలా నలిగిందో ? పార్టీకి ఎలా దెబ్బ పడిందో ? ఇప్పుడు వైసీపీలోనూ అదే నియోజకవర్గాల్లో మళ్లీ అధికార పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే మధ్య పోరుతో కేడర్ నలుగుతోంది. పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి ఎస్సీ రిజర్వ్డ్ నియోజకవర్గంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ వర్సెస్ చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా మధ్య గ్రూపు పాలిటిక్స్ హీటెక్కాయి. టీడీపీ ప్రభుత్వంలో చింతలపూడి ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న పీతల సుజాత వర్సెస్ నాటి ఏలూరు ఎంపీ మాగంటి బాబు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. రెండు వర్గాలు ఏ మాత్రం తగ్గలేదు.. కరవమంటే కప్పకుకోపం.. విడవమంటే పాముకు కోపం చందంగా రెండు వర్గాలు వ్యవహరించాయి. చివరకు ఈ గ్రూపు పోరులోనే మంత్రి పీతల సుజాత మంత్రి పదవి సైతం కోల్పోయారు. అయినా కూడా గత ఎన్నికలకు ముందు వరకు రెండు వర్గాల పంతం అలాగే నడిచింది. చివరకు సుజాత నాలుగన్నరేళ్ల పాటు చింతలపూడి ఏఎంసీ చైర్మన్ పదవిని కూడా భర్తీ చేయలేదు. చివరకు ఎన్నికల వేళ సుజాతకు టిక్కెట్ కూడా రాలేదు. మాగంటి సీటు దక్కించుకున్నా ఘోరంగా ఓడిపోయారు. కట్ చేస్తే ఇప్పుడు ఏపీలో ప్రభుత్వం మారింది.. చింతలపూడిలో వైసీపీ ఎమ్మెల్యే, ఏలూరులో వైసీపీ ఎంపీయే ఉన్నారు. నాడు టీడీపీ ప్రభుత్వంలో ఎంపీ, ఎమ్మెల్యే వర్గాల మధ్య వార్‌లో పార్టీ కేడర్ ఎలా నలిగిపోయిందో ఇప్పుడు వైసీపీ కేడర్ కూడా అలాగే నలుగుతోంది. గత ఎన్నికల్లో గెలిచాక తొలి యేడాది బాగానే ఉన్న ఎమ్మెల్యే ఎలీజా, ఎంపీ శ్రీధర్ మధ్య ఇప్పుడు తీవ్రమైన ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోంది. చివరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం పలు కీలక పంచాయతీల్లో వైసీపీలోనే రెండు వర్గాల ఫ్యానెల్స్ పోటీ చేశాయి. ఈ పోరులో ఎలీజా వర్గం ఎక్కడ పోటీ చేసినా చిత్తుగా ఓడిపోయింది. చింతలపూడి నియోజకవర్గానికి గుండెకాయ లాంటి జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్మన్ పదవి యేడాది క్రితమే ఎంపీ వర్గానికి చెందిన వ్యక్తికి ఇవ్వాలని అనుకున్నారు. ఈ వర్గ పోరు తర్వాత ఎమ్మెల్యే తన వర్గానికి చెందిన నేతకు చైర్మన్ పదవి కట్టబెట్టుకోవాలని చూశారు. చివరకు రెండు వర్గాలు పంచాయితీ సీఎం వద్దకు చేరడంతో సీఎం మధ్యేమార్గం బీసీలకు ఈ పదవి ఇచ్చేశారు. ఇప్పుడు ఎంపీపీల విషయంలోనూ వీరి మధ్య పంచాయితీ తెగేలా లేదు. వాస్తవంగా చూస్తే ఎంపీ శ్రీధర్‌కు చింతలపూడి సొంత నియోజకవర్గం కావడం? ఆయన తండ్రి కోటగిరి విద్యాధరరావు ఇక్కడ రెండున్నర దశాబ్దాలుగా ఏకచక్రాధిపత్యంగా రాజకీయాలు చేయడంతో ప్రతి గ్రామంలోనూ కోటగిరి వర్గం బలంగా ఉంది. అయితే కోటగిరి వర్గానికి ధీటుగా తాను కూడా పట్టు పెంచుకోవాలని ప్రయత్నిస్తోన్న ఎమ్మెల్యే కొన్ని వర్గాలను ఎంకరేజ్ చేస్తూ వస్తున్నారు. ఎంపీ వర్గం ఎక్కువగా ఉండడంతో అక్కడ ప్రయార్టీ లేదనుకున్న వారంతా ఇప్పుడు ఎమ్మెల్యే వర్గంలో చేరిపోతున్నారు. ఇంకా చెప్పాలంటే ఎంపీకి బలమైన వ్యతిరేక వర్గంగా ఉన్న టీడీపీ నేతలను ఎమ్మెల్యే స్వయంగా పార్టీలో చేర్చుకుంటున్నారు. పైగా ఎంపీ సొంత మండలంలోనూ ఎమ్మెల్యే ఈ తరహా ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలో జరిగే ప్రాథమిక సహకార సంఘాల ఎన్నికల్లోనూ ఎమ్మెల్యే తన సొంత ఫ్యానెల్స్‌ను పోటీలోకి దింపుతారన్న ప్రచారం జరుగుతోంది. ఎంపీ శ్రీధర్ మాత్రం.. తన సొంత మండలంలో తన కేడర్‌ను స్ట్రాంగ్ చేస్తే పార్టీకి.. అటు ఎమ్మెల్యేగా కూడా ప్లస్సే కదా ? అని భావిస్తున్నారు. ఏదేమైనా ఈ రెండు వర్గాల పోరులో చింతలపూడి కేడర్ రెండుగా చీలిపోతోంది.

## గ్రౌండ్ లోకి వెళితేనే సమస్యలు...

గుంటూరు, మే 26, (న్యూస్ పల్స్) నిండు పున్నమి వేళ చంద్రుడు కాంతులు చూడతరమా అంటారు కవులు. అలాగే అధికారంలో ఉన్నపుడు చంద్రబాబు వైభవం కూడా పౌర్ణమి చంద్రుడిలాగే తళతళలాడేది. కానీ ఓడిన తరువాత మబ్బులు పట్టిన చంద్రుడు అయిపోయారు. సరే మబ్బులు తాత్కాలికం. అవి చెదిరిన నాడు మళ్ళీ వెన్నెల వస్తుంది. పున్నమి కళతో పులకిస్తుంది. మరి చంద్రబాబుని ఆయన తెలుగుదేశం పార్టీని కమ్ముకున్న మబ్బులు వీడిపోయేది ఎన్నడు, ఎపుడు అన్నదే తమ్ముళ్ల చర్చ. అయితే ఏ మబ్బులు అన్న ప్రశ్న కూడా దాని వెనకాలే వస్తోంది మరి. నాయకుడికీ ప్రజలకు మధ్య వారధిగా మీడియా ఉండాలి. కానీ చంద్రబాబు చేసుకున్న పుణ్యమో పాపమో తెలియదు కానీ అడ్డంగా అనుకూల మీడియా నిలబడిపోయింది అన్న విమర్శలు అయితే ఉన్నాయి. తెలుగుదేశం గురించి జనాలు ఏమనుకుంటున్నారో తెలియనివ్వని కారణంగానే 2019 ఎన్నికల్లో చంద్రబాబు ఘోరంగా ఓడారు. ఇక గడచిన రెండేళ్ళ కాలంలో అయినా చంద్రబాబుకు బాకా ఊదుతున్న మీడియా కొంతలో కొంత నిజాయతీగా పనిచేసిందా అంటే అదీ లేదు. జగన్ ఫేక్ సీఎం, ఆయనది గెలుపే కాదు అంటూ చంద్రబాబుని సంతృప్తి పెడుతోంది. మరి ఈ మధ్యన జరిగిన లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా టీడీపీ చావు దెబ్బ తిన్నది. దానిని కూడా మసిపూసి మారేడుకాయ చేసే పనిలోనే అనుకూల మీడియా ఉండడమే దారుణం. ఎంతసేపూ చంద్రబాబుని చాణక్యుడు, దీక్షాదక్షుడు అంటూ పొగడడమే తప్ప క్షేత్ర స్థాయిలో టీడీపీ సీన్ ఏంటి అన్నది కళ్లకు కట్టినట్లుగా చూపించే ధైర్యం అనుకూల మీడియాకు లేదనే అంటున్నారు. చంద్రబాబును ఎన్నుకోక జనాలు తప్పు చేశారు అన్న భావన కల్పిస్తే ఇక టీడీపీ ఆత్మ విమర్శ ఎందుకు చేసుకుంటుంది. అదే సమయంలో జగన్ కి పాలన చేతకాదు, ఆయన ఏ క్షణమైనా జైలు లోకి పోతాడు. ఆయన మీద తీవ్ర వ్యతిరేకత ఉంది అంటూ అల్లే కథనాలతో సైకిల్ పరుగులు తీస్తుందా అన్నదే పెద్ద డౌట్ అంటున్నారు. వాస్తవాలు తెలియకపోవడం వల్లనే తిరుపతి ఉప ఎన్నికల్లో వైసీపీ సాధించిన విజయాన్ని కూడా తప్పుగా టీడీపీ పెద్దలు అర్థం చేసుకుంటున్నారు.

క్షేమం కోరుకునే వారు ఎవరైనా నిజాన్ని నిష్టూరమైనా చెబుతారు. కానీ చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడాలనుకునే వర్గాలు, ఆయన సొంతమని భావించే మీడియా మాత్రం ఆ పని అసలు చేయడంలేదు. ఆ పత్రికల వార్తలు చదివితే ఎన్నికలు ఎపుడు పెట్టినా చంద్రబాబు సీఎం అని తమ్ముళ్ళు ఉప్పొంగిపోవడం ఖాయం. కానీ జనాల్లోకి వెళ్ళి తమ పట్ల ఎందుకు వ్యతిరేక భావం పెంచుకున్నారు, అసలు టీడీపీ ఏ విధంగా తన విధానాన్ని మార్చుకుని జనాలకు చేరువ కావాలి అన్నది కనుక కచ్చితమైన ఆలోచన చేస్తే టీడీపీ పుంజుకుంటుంది. అనుకూల మీడియా చెప్పని నిజం ఏంటి అంటే ఈ రోజుకీ మెజారిటీ జనాల్లో జగన్ పట్ల మోజు ఉంది. మరి ఇది తెలిస్తే కదా తెలుగుదేశం కొత్త స్టెప్ వేసేది. ఆ మబ్బులు వీడేది. మరి మీడియానే తన బలం అనుకుంటున్నా టీడీపీ అధినాయకత్వం అయినా ఈ అడ్డును తొలగించుకుని బయటకు తొంగి చూడగలదా..

## రాజకీయాల్లో నలిగిపోయిన సుధాకర్

విశాఖపట్టణం, మే 26, (న్యూస్ పల్స్) విశాఖ జిల్లా నర్సీపట్నం మత్తు డాక్టర్ సుధాకర్ గుర్తున్నారా. గత ఏడాది కరోనా ఫస్ట్ వేవ్ లో ఆయన హల్ చల్ చేశారు. నాడు దేశమంతటికీ కరోనా అపుడే పరిచయం అయింది. ఢిల్లీలోని ఎయిమ్స్ లాంటి చోటే డాక్టర్లకు పీపీఇ కిట్స్ లేవు. మాస్కుల విషయం కూడా పెద్దగా అవగాహన లేని రోజులు అవి. అలాటి టైమ్ లో మత్తు డాక్టర్ ఏకంగా మీడియాకు ఎక్కి ప్రభుత్వం మీద నిందలు వేశారు. డాక్టర్లకు ఏ సురక్షితమైన పరికరాలు ఇవ్వలేదేని, వారికి కరోనాకు బలి చేస్తారా అంటూ ఆయన ఘాటుగానే మాట్లాడారు. ప్రభుత్వ సర్వీస్ రూల్స్ కి విరుద్ధంగా ప్రవర్తించారని ఆయన్ని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆ తరువాత ఆయన మరోసారి విశాఖ వీధుల్లో హడావుడి చేశారు. దాంతో అది కాస్తా హై కోర్టు దాకా వెళ్ళింది. ఆ మీదట మొత్తం వ్యవహారం మీద సీబీఐ విచారణ కూడా జరిపించారు. ఆ నివేదిక ఏంటో ఇంకా చూడాల్సి ఉంది. ఇంతలోనే మత్తు డాక్టర్ సుధాకర్ గుండె పోటుతో మరణించారు అన్న వార్త. ఆయన చావుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని చంద్రబాబు, లోకేష్ భారీ స్టేట్ మెంట్స్ ఇచ్చారు. మొత్తానికి ఆయన విషయంలో టీడీపీ మరోసారి రాజకీయ మొదలెట్టింది అని వైసీపీ నుంచి విమర్శలు వస్తున్నాయి. అసలు ఇంతకీ డాక్టర్ సుధాకర్ సాధించింది ఏంటి అన్నదే ఇక్కడ చర్చ. ఇదిలా ఉంటే మత్తు డాక్టర్ ఆ రోజున మీడియా ముందు జగన్ సర్కార్ మీద చేసిన విమర్శల వెనక టీడీపీ పెద్దలు ఉన్నారని కూడా వైసీపీ నేతలు ఆరోపించారు. నిజానికి చక్కగా గౌరవంగా సర్కార్ ఉద్యోగం చేసుకునే వైట్ కాలర్ జాబ్ హోల్డర్ రోడ్డు మీదకు ఎందుకు అలా రావాల్సివచ్చింది, ఆయన జీవితం గత ఏడాదిగా ఎందుకు తల్లకిందులు అయింది అన్నది కూడా ఇక్కడ చూడాలి. ఇక ఆయనకు రాజకీయాల్లోకి రావాల్సి వుందని, 2019 ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి టీడీపీ టికెట్ ట్రై చేశారని కూడా అప్పట్లో వార్తలు వచ్చాయి. మరి 2024కి హామీ ఇచ్చి ఆయన్ని రాజకీయ ముగ్గులోకి కొందరు దింపారని కూడా ప్రచారం అయితే సాగింది. ఏది ఏమైనా ఒక మంచి డాక్టర్ ఏమీ కాకుండా అసువులు బాయడం మాత్రం దారుణమే.

మత్తు డాక్టర్ సుధాకర్ ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ హద్దులు మీరారు. ఆయనకు ఆ ధైర్యం ఎవరు ఇచ్చారు అన్నది కూడా ఇక్కడ చూడాలి. ఇక ఆయన మీద విశాఖ వీధుల్లో పోలీసులు చేసిన అతి కూడా జగన్ సర్కార్ కి చెడ్డ పేరు తెచ్చి పెట్టింది. మొత్తానికి ఢీ అంటే ఢీ అంటూ సాగుతున్న రెండు పార్టీల రాజకీయాల్లోకి డాక్టర్ సుధాకర్ చొరబడి అన్యాయం అయిపోయారు అన్న మాట మాత్రం అంతటా వినిపిస్తోంది. ఆయన కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని చంద్రబాబు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో దీన్ని రాజకీయం చేసిన ప్రతిపక్షాలు కూడా ఎంతో కొంత మూల్యం చెల్లించాలిగా అన్న వాదన కూడా మరో వైపు నుంచి వస్తోంది. మొత్తానికి ఒక మంచి డాక్టర్ మాత్రం ఈ లోకం నుంచి అర్ధాంతరంగా అంతర్ధానం కావడం మాత్రం బాధాకరం, దానికి రాజకీయాలే కారణమని అంతా అంటున్నారు.

## భారీగా పెరిగిన భూ గర్భ జలాలు

కడప, మే 26, (న్యూస్ పల్స్) కడప జిల్లాలో కొన్ని మండలాలు మినహా మిగిలిన చోట్ల భూగర్భ జలాలు బాగున్నాయి. రాజాం నియోజకవర్గం పరిధి సంతకవిటి మండలంలో 1.52 మీటర్ల లోతులోనే లభ్యమవుతున్నాయి. మండువేసవిలోనే ఇలా ఉండగా. వర్షాకాలంలో మరింత మీదకు వచ్చే అవకాశం ఉంది. రాజాంలో 1.72 మీటర్లలో, రేగిడిలో 2.31, వంగరలో రెండు, ఎల్ఎన్‌పేట మండలంలో 1.89, సరుబుజ్జిలిలో 1.84, జలుమూరులో 2.82, హిరమండలంలో 2.34, గార మండలంలో 2.34 మీటర్ల లోతులోనే భూ గర్భజలాలు తొణికిసలాడుతున్నాయి. ఈప్రాంతాల్లో బోర్లు తక్కువలోతులో వేస్తున్నా నీరుపడుతోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో సాగునీటి కోసం తక్కువ ఖర్చుతోనే వ్యవసాయ బోర్లు, బావులు, ఇంటి అవసరాలకు బోరింగులను వేయించుకుంటున్నారు. 20 నుంచి 30 మీటర్ల లోతుకు వెళ్లగానే కావాల్సినంత నీరు పడుతోంది. భూగర్భ జలాలు పుష్కలంగా ఉండడంతో వేసవిలో కూడా సాగునీటి చెరువులు, బావులు జలకళను సంతరించుకున్నాయి. రణస్థలం మండలంలోని పైడిభీమవరం వద్ద అత్యంత ప్రమాదకరంగా 13.91 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా, ఎచ్చెర్లలో కూడా ఇదే పరిస్థితి ఉంది. అలాగే పలాస, కంచిలి, సోంపేటలో కూడా భూగర్భ జలాలు కొంతవరకూ అడుగంటాయి. జిల్లా వ్యాప్తంగా లెక్కిస్తే సరాసరిన 7.88 మీటర్ల లోతులో భూగర్భ జలాలు లభ్యమవుతూ సేఫ్ జోన్‌లో ప్రస్తుతం కొనసాగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది సుమారు ఎనిమిది మీటర్లగా ఉండేది.



## లాస్ట్ ఛాన్స్ పేరుతో ప్రచారం

విజయవాడ, మే 26, (న్యూస్ పల్స్) తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు సానుభూతి కోసం ప్రయత్నిస్తున్నారు. ఆయన సానుభూతితోనే వచ్చే ఎన్నికల్లో గట్టెక్కాల్సి ఉంటుంది. మరో దారి లేదు. జగన్ పాలనపై ఇప్పటికీ పెద్దగా వ్యతిరేకత కన్పించడం లేదు. తొలిసారి ముఖ్యమంత్రి అయినా జగన్ సమర్థవంతంగానే పాలన సాగిస్తున్నారు. సంక్షేమ పథకాలను నిలిపివేయడం లేదు. కరోనా సమస్య తాత్కాలికమే. దీంతో చంద్రబాబు తనకు చివరిఛాన్స్ అని సానుభూతి కోసం వచ్చే ఎన్నికల్లో ప్రయత్నించాల్సి ఉంది. చంద్రబాబుకు ఇప్పటికే 70 ఏళ్లు దాటిపోయాయి. అయినా ఆయన హుషారుగానే ఉన్నారు. యువనేతలకంటే ఉత్సాహంగా చంద్రబాబు పనిచేస్తున్నారు. జగన్ ప్రభుత్వంపై వ్యతిరేకత తీవ్రంగా ఉంటేనే తనకు విజయం దక్కుతుందని చంద్రబాబుకు తెలియంది కాదు. కానీ రెండేళ్లలో పెద్దగా ప్రజల్లోజగన్ ప్రభుత్వం పట్ల అసంతృప్తి కన్పిచడం లేదు. తన నాయకత్వంపై ప్రజలకు చెప్పాలన్న ఎదురుగా గత ఐదేళ్ల పాలన కన్పిస్తుంది. తన వయసు అయిపోయిందని, ఇదే తనకు చివరి ఛాన్స్ అని చంద్రబాబు వచ్చే ఎన్నికలకు వెళ్లనున్నారు. గత ఎన్నికల్లో ఒక్క ఛాన్స్ అని జగన్ వెళ్లి విజయం సాధించడంతో అదే నినాదాన్ని మార్చి లాస్ట్ ఛాన్స్ అని చంద్రబాబు ఎన్నికలకు వెళతారని తెలుస్తోంది. 2029 తర్వాత తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని కూడా చంద్రబాబు ప్రకటన చేసే అవకాశం లేకపోలేదంటున్నారు. ప్రజల్లో సానుభూతి దీని వల్లనే వస్తుందన్న విశ్వాసంతో చంద్రబాబు ఉన్నారు. అయితే సానుభూతి అన్నది ఇప్పుడు పెద్దగా పనిచేయడం లేదు. రెండు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి. ఎన్టీఆర్ కే సానుభూతి దక్కలేదు. మరి చంద్రబాబు వంటి నేతకు ప్రజలు సానుభూతితో ఆదరిస్తారా? అన్నది ప్రశ్నార్థకమే. ఇప్పుడు చంద్రబాబు ఎదుట లాస్ట్ ఛాన్స్ అనే నినాదం తప్ప మరోటి లేదు. ఆ దిశగానే ఆయన భవిష్యత్ రాజకీయం ఉండబోతుందని తెలుగుదేశం పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరి చంద్రబాబుకు ఈ లాస్ట్ ఛాన్స్ నినాదం పనిచేస్తుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

## సిక్కోలులో కోలేకోనేది ఎప్పుడు

శ్రీకాకుళం, మే 26 (న్యూస్ పల్స్) ఏపీ ప్రధాన ప్రతిపక్షం టీడీపీకి గట్టి పట్టున్న జిల్లాల్లో ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం ఒకటి. రాష్ట్ర విభజనకు ముందు.. తర్వాత కూడా పార్టీకి గట్టి పట్టున్న జిల్లాగా గుర్తింపు పొందిన ఈ జిల్లాలో గత 2019 ఎన్నికల్లో టీడీపీకి గట్టి ఎదురు దెబ్బతగిలింది. ఇచ్ఛాపురం, టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గాలు, శ్రీకాకుళం పార్లమెంటు నియోజక వర్గం మినహా.. అన్ని చోట్లా పార్టీ చతికిలపడింది. పార్టీ కంచుకోటలు కూలిపోయాయి. ఎన్నికల్లో గెలుపు ఓటములు సమంజసమే అనుకున్నా.. తర్వాత అయినా.. పార్టీ పుంజుకునేందుకు ప్రయత్నించాలి కదా..! కానీ, టీడీపీలో ఆ తరహా వాతావరణం కనిపించడం లేదు. ఎవరికి వారుగా రాజకీయాలు చేసుకుంటున్నా రు. ఎవరికివారు.. అంతర్గత పోరుతో సతమతం అవుతున్న పరిస్థితి కళ్లకు కడుతోంది. నిజానికి జిల్లాలో పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉన్నప్పటికీ.. టీడీపీకి ప్రయోజనం లేకుండా పోయిందనే వాదన బలంగా వినిపిస్తోంది. చాలా నియోజకవర్గాల్లో యువ నేతలు ఎక్కువగా ఉన్నప్పటికీ.. వారికి ఎలాంటి ప్రాధాన్యం లేకుండా పోయిందనే వాదన బలంగా వినిపిస్తోంది. ఇక, సీనియర్లు కూడా సఖ్యతలేని రాజకీయాలు చేస్తున్నారనే వాదన కూడా ఉంది. రాజాం, పలాస, నరసన్నపేట, శ్రీకాకుళం వంటి కీలక నియోజకవర్గాలు పార్టీకి దశాబ్దాలుగా కంచుకోటలు అయినా ఇప్పుడు ఇక్కడ పార్టీని నడిపించే నాథుడు లేక ఇవి కూలిపోతోన్న పరిస్థితి. పలాసలో గౌతు శిరీష క్రియాశీలకంగా లేరు. ఆమె ఎక్కువగా వైజాగ్‌లో ఉండడంతో పలాస టీడీపీ కేడర్ నిరాశలో ఉంది. మంత్రి అప్పలరాజు ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గం కావడంతో ఇక్కడ వైసీపీకి బ్రేకులు వేయాలంటే శిరీష స్థానికంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇక రాజాంలో మాజీ మంత్రి కోండ్రు మురళీ గత రెండు ఎన్నికల్లో వరుసగా ఓడిపోవడంతో నైరాశ్యంలో ఉన్నారు. తాను ఎంత కష్టపడినా కళా వెంకట్రావు వర్గం దెబ్బ కొడుతుందని ఆయన రాజకీయం చేయడమే మానుకుంటోన్న పరిస్థితి. శ్రీకాకుళంలో టీడీపీ పుట్టినప్పటి నుంచి పార్టీనే అంటి పెట్టుకుని ఉన్న గుండ లక్ష్మీదేవితో పాటు ఆమె భర్త మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ వయోః భారంతో రాజకీయాలకు దూరమయ్యారు. ఇక ఈ ఫ్యామిలీ శకం ముగిసినట్టే..! ఇక ఎచ్చెర్లలో మాజీ మంత్రి, మాజీ ఏపీ టీడీపీ అధ్యక్షుడు కళా వెంకట్రావు వారసుడిని ప్రమోట్ చేస్తుంటే టీడీపీ కేడర్ అంగీకరించడం లేదు. ఏదేమైనా ఏపీ టీడీపీ అధ్యక్షుడు సొంత జిల్లాలో పార్టీ పరిస్థితి ఇలా ఉండడం దారుణ స్థితికి అద్దం పడుతోంది.

## బెజవాడలో తమ్ముళ్లు...

### కల'విడి'గా...

విజయవాడ, మే 26, (న్యూస్ పల్స్) ఒక్క ఎంపీ.. ఒకే ఒక్క ఎంపీ కోసం.. టీడీపీ అధినేత చంద్రబాబు తీసుకున్న నిర్ణయం.. పార్టీలో సెగలు రేపుతోంది. బాబు నిర్ణయంపై అలక బూనిన సీనియర్ నాయకులు, పార్టీ కోసం నాయకులు కూడా ఇప్పుడు కీలక సమయంలో మౌనం పాటిస్తున్నారు. ముఖ్యంగా విజయవాడ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్లుగా గుర్తింపు సాధించిన మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు, ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్నలు.. కొన్ని రోజులుగా మౌనం పాటిస్తున్నారు. స్థానిక ఎన్నికల సమయంలో పొడచూపిన విభేదాలతో వీరు అలకపాన్పు ఎక్కారని విజయ వాడలో జోరుగా ప్రచారం సాగుతుండడం గమనార్హం. బోండా ఉమాను తీసుకుంటే.. సెంట్రల్ నియోజకవర్గంతోపాటు.. విజయవాడపై మంచి పట్టున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. అదే సమయంలో అధికార వైసీపీని కార్నర్ చేయడంలోనూ బొండా ముందున్నారు. అయితే.. కార్పొరేషన్ ఎన్నికల సమయంలో టీడీపీని కించపరిచారని, ముఖ్యంగా చంద్రబాబును అవమానించారనే కారణంగా.. స్థానిక ఎంపీ కేశినేని నానిపై తీవ్ర విమర్శలు చేశారు. టికెట్ ఇవ్వడం వల్లే కేశినేని నాని విజయం దక్కించుకున్నారని.. బాబు ప్రమేయం లేకపోతే.. రాజీనామా చేసి విజయం దక్కించుకోవాలని సవాల్ విసిరారు. ఇక, ఈ కోవలోనే.. ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న కూడా ఫైరయ్యారు. ఎంపీ నాని కేంద్రంగా తీవ్ర విమర్శలు చేశారు. అయితే.. చంద్రబాబు మాత్రం వీరి రగడను పట్టించుకోకుండా.. ఇరు పక్షాలను సర్దిచెప్పకుండా.. కేశినేని వైపు మొగ్గు చూపారు. దీంతో ఎన్నికల్లో తీవ్రస్థాయిలో ప్రభావం పడింది. కార్పొరేషన్ ఎన్నికల్లో విజయవాడలో గెలిచి తీరుతుందని అంచనాలు వేసుకున్నా.. విఫలమైంది.

# రైతుల అందోళనకు ఆరునెలలు

## విశాఖలో సీపీఎం నిరసన

విశాఖపట్నం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలు రద్దు చేయాలని, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాల ని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న ఉద్యమం ప్రారంభమై నేటికి ఆరు నెలలు పూర్తైన సందర్భం గా ప్రజాసంఘాల నేతలు దేశవ్యాప్తం గా బ్లాక్ డే కు పిలుపునిచ్చారు.దింట్లో భాగంగా విశాఖలో సీపీఎం నేతలు నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీపీఎం నేతలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నర్సింగరావు పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు.గత ఆరు నెలలుగా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న కేంద్రం ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కేంద్ర ప్రభు త్వం రైతుల సమస్యలపై స్పందించా లని డిమాండ్ చేశారు.

# జగిత్యాలలో విషాదం

## నవ వరుడు కరోనా తో మృత్యువాత

## వధువు, కుటుంబం పాజిటీవ్

జగిత్యాల పెళ్లి కుదిరింది. పెళ్లి చేసుకునే విషయంలో అన్నీ దగ్గరుండి తాను చూసుకున్నాడు. ఎక్కడ ఎవరి ద్వారా కరోనా వచ్చిందో తెలియదు గాని పెళ్లి తర్వాత కరోన పరీక్షలు చేయించుకుంటే కుటుంబంలో అందరికీ కరోనా ఉన్నట్లుగా తేలింది వరుడు ప్రాణం కోల్పోయాడు . జగిత్యాల జిల్లాలో చోటు చేసుకుంది జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం యమపూర్ గ్రామానికి చెందిన చింతకుంట కృష్ణంరాజు 26 అనే నూతన వరుడు కోవిడ్ తో చికిత్స పొందుతూ మరణించాడు.రాజు కి ఇదే నెల 13 నా వివాహం జరిగింది. పెళ్లి అయిన 3 రోజులకే కోవిడ్ లక్షణాలు కనిపించగ ఆయన కి టెస్టులో పాజివిట్ గా తేలింది. ఆయన తో పాటు పెళ్లి కూతురు కి సైతం పాజిటివ్ వచ్చింది. ఇంట్లో కుటుంబీకులకు కూడా కోవిడ్ పాజిటివ్ గా తేలింది. రాజుకి శ్వాస తీసుకోవటం లో ఇబ్బందులు రాగానే ఆయనను ఆసుపత్రికి తరలించారు. కాగా హైదరాబాద్ లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ రోజు మరణించాడు.పెళ్లయ్యాక 13 రోజులకే మరణించటం కుటుంబం లో తీవ్ర విషాదం నింపింది.రాజు కుటుంబీకులకు కూడా కరోన వచ్చిన వారికి వ్యాధి తీవ్రత అంతగా లేదు.ఏది ఏమైనా పెళ్ళైన 3 రోజులకే ఆసుపత్రి లో చేరి మరణించటం ఇంట్లోనూ అటు గ్రామంలోను తీవ్ర విషాదం నింపింది.

# సింహాచలంలో వైశాఖి పౌర్ణమి ఉత్సవాలు

## మూడు మణుగులు చందనం సమర్పణ, విశేష పూజలు

విశాఖపట్నం ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయం లో ఈరోజు వైశాఖ మాస శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేకువజామున సుప్రభాత సేవ,తదుపరి స్వామివారికి మూడు మణుగులు చందనాన్ని స్వామి వారికి సమర్పించి స్వామి వారికి విశేష పూజలు బాల భోగం,రాజ భోగం సమర్పిస్తున్నట్లు అలాగే విశేష హోమం మరియు స్వామి వారి నిత్య కళ్యాణం చేస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. కోవిడ్ మహమ్మారి విజృబిస్తున్న ఈ తరుణంలో భక్తులకు ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు మాత్రమే భక్తులుకు నిత్య దర్శనాలు ఉన్నాయని తర్వాత నుంచి భక్తులకు ఎటువంటి దర్శనాలు లేవని తెలిపారు

# ఆక్సిజన్ ఆన్ వీల్స్ ను ప్రారంభించని మంత్రి అప్పలరాజు

శ్రీకాకుళం శ్రీకాకుళం జిల్లా పలాస కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆక్సిజన్ ఆన్ వీల్స్ ను రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రారంభించారు. పలాస సి.హెచ్.సిలో ఏర్పాటుచేసిన ఆక్సిజన్ ఆన్ వీల్స్ ను మంత్రి అప్పలరాజు ప్రారంభించారు. ఆక్సిజన్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని తూర్పు నావికాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేంద్ర బహదూర్ సింగ్ రూపకల్పన చేశారు. పి.ఎస్.ఏ ఆక్సిజన్ ప్లాంట్ ను మొబైల్ ప్లాట్ ఫామ్ కింద అనుసంధానం చేసి అవసరమగు ఆసుపత్రుల వద్ద ఆక్సిజన్ అందించే కార్యక్రమాన్ని తూర్పు నావికాదళం చేపట్టింది. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ జె నివాస్ కోరిన మీదట తూర్పు నావికాదళం ఆక్సిజన్ ఆన్ వీల్స్ పలాస ఆస్పత్రి వద్ద సమకూర్చినది. ఈ ప్రాజెక్టును విశాఖపట్నం నావల్ డాక్ యార్డ్ నిపుణుల బృందం వచ్చి నిర్వహణ బాధ్యతలను చేపట్టింది. ఆసుపత్రి సిబ్బందికి కూడా దీనిపై శిక్షణను కల్పించారు. కోవిడ్ భాదితులకు 24 హెచ్ ఆక్సిజన్ ను సరఫరా చేస్తుంది. మూడు నెలల పాటు ఆసుపత్రి వద్ద ఈ ప్లాంట్ లభ్యంగా ఉంటుంది. ఈ మేరకు నేవీ అధికారులు ఒక ప్రకటన జారీ చేస్తూ సాధారణ ప్రజానీకానికి సహాయక చర్యల్లో నేవి ముందుంటుందని ప్రకటించారు. డాక్టర్ అప్పలరాజు కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ వీల్స్ ఆన్ ఆక్సిజన్ కార్యక్రమం బృహత్తరమైనదన్నారు. పలాస ఆసుపత్రులకు సుదూరం నుండి వచ్చే కోవిడ్ బాధితులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు.

# సముద్ర తీర ప్రాంతాల్లో కలెక్టర్

విజయనగరం జిల్లాలోని సముద్ర తీర గ్రామాల్లో జిల్లా కలెక్టర్ డా ఎం.హరిజవహర్ లాల్ బుధవారం పర్యటించారు. యాస్ తుఫాను ప్రభావంపై తీర గ్రామాల ప్రజలతో మాట్లాడి తెలుసుకున్నారు. పూసపాటి రేగ మండలం కోనాడ గ్రామం సందర్శించారు. తుఫాను షెల్టర్ సందర్శించి ముందస్తు ఏర్పాట్లపై ఆరా తీసారు. జాయింట్ కలెక్టర్ డా జి.సి.కిషోర్ కుమార్, ఆర్ డి ఓ భవానీ శంకర్ లతో కలిసి తీరం సమీపం వరకు వెళ్లి పరిస్థితిని అంచనా వేసారు. తీర ప్రాంత గ్రామాల్లో సిబ్బంది గ్రామాల్లోనే వుంటూ ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. గ్రామానికి సరిపడే సరుకులను నిల్వ చేసింది లేనిదీ తెలుసుకున్నారు.

# కరోనా కష్టకాలంలో కన్నీళ్లు తెప్పిస్తున్న అల్లోపతి మందులు, నిత్యావసర సరుకులు

బేతంచెర్ల కరోనా మహమ్మారి రోజురోజుకు రూపాంతరం చెందుతూ దిక్కుతోచని విధంగా కష్టాల్లోకి నెట్టింది, మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా అల్లోపతి మందుల ధరలు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతు సామాన్యులకు కన్నీటిని తెప్పిస్తున్నాయి. కరోనా మహమ్మారి రెండవ దశలో చేస్తున్న విలయతాండవాన్ని చూసి చిన్నపాటి జ్వరం, జలుబు వచ్చిన మెడికల్ షాప్ ను, వైద్యులను ఆశ్రయిస్తే వైద్యపరీక్షల ధరలు అల్లోపతి మందుల ధరలు చూసి బాదితలకు చుక్కలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు కారోనాను ఎదుర్కునేందుకు వ్యాధినిరోధక శక్తిని పెంచుకోవాలని అందుకు గుడ్లు, చికెన్ అధికంగా వినియోగించడం తప్పదని వైద్యులు సూచిస్తుండంతో సామాన్యులు వాటిని కొనలేక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. కరోణ మహమ్మారి కారణంగా దిన కూలీలు ఉపాధి లేక కడుపులు కాల్చుకొని బతుకు ఈడుస్తుంటే కనీసం పిల్లలకైనా, అన్నపానీయాలు పెట్టుకుందామని నిత్యావసర సరుకులు కొనబోతే రోజురోజుకు ధరలు చుక్కలు చూపుతున్నాయని వాపోతున్నారు. ఒకపక్క ఆర్థిక ఇబ్బందులు మరోపక్క కరోనా మరణ మృదంగ వార్తలు సామాన్యుల పాలిట శాపంగా మారాయి. కనీసం అప్పులు చేసి వైద్యం చేయించుకోవాలి అన్నా ఆర్థిక వెసులుబాటు లేక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికితోడు కరోనా బాధితుల పట్ల సమాజం వ్యవహరిస్తున్న తీరు పలు ఇబ్బందులకు గురిచేస్తుంది. ప్రభుత్వం అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తున్నప్పటికీ క్వారంటైన్ హోమ్ ఐసోలేషన్ వంటి విధానాలతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు సామాన్యులు సైతం అరకొర వైద్యం తెలిసిన వైద్యుల దగ్గరికి వెళ్లి చికిత్సలు చేయించుకుంటూ అధిక మొత్తంలో ధనం ఖర్చు చేస్తూ ఆర్థిక ఊబిలో కురుకు పోతున్నారు. ఇదే అదునుగా భావించిన వైద్యులు, వైద్యపరీక్షల ల్యాబులు, మెడికల్ షాపు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా సామాన్యల నుంచి ఫీజులు మందుల పేరుతో దోపిడీ చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సామాన్యుల్లో అవగాహన కల్పించడంతో పాటు వీరు చేస్తున్న ఆగడాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

# బ్లాక్ ఫంగస్ కోసం ఉస్మానియా

హైదరాబాద్, మే 26, (న్యూస్ పల్స్:) బ్లాక్ ఫంగస్ రోగులకు వైద్య సేవలందించుందుకు ప్రత్నామ్నాయ చర్యలు తీసుకోవాలనే డిమాండ్ సర్వత్రా వినబడుతోంది. కొవిడ్ బారిన పడి కోలుకున్న అనంతరం డయాబిటిస్ అదుపులో ఉంచుకోలేని వారు బ్లాక్ ఫంగస్ కు గురవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కేసులు అధికంగా నమోదవుతుండడంతో ఈ నెల 15వ తేదీన కోఠి ఈఎన్టీ ఆస్పత్రిని బ్లాక్ ఫంగస్ రోగుల కోసం నోడల్ హాస్పిటల్ గా ప్రభుత్వం ప్రకటించింది. 16వ తేదీ నుండి ఆస్పత్రిలో వైద్య సేవలు మొదలయ్యాయి.మొదట్లో అంతంత మాత్రంగానే రోగుల తాకిడి ఉండగా ప్రస్తుతం ఊహించని విధంగా రోగుల సంఖ్య పెరుగుతోంది. ఇతర రాష్ట్రాల నుండి కూడా రోగులు వైద్యం నిమిత్తం వస్తున్నారు. ఈఎన్టీ ఆస్పత్రిలో మొత్తం 200 పడకలు ఉండగా వీటికి అదనంగా మరో 30 పడకలను అందుబాటులోకి తెచ్చింది. అయినా ఈ పడకలు ఏ మూలకు సరిపోవడం లేదు. ఆస్పత్రి ఆవరణలో రోగులు పడకలు, వైద్యం కోసం పడిగాపులు గాస్తున్నారు. అంతేకాకుండా ఎంఆర్ఐ, సీటీ స్కాన్ , వైద్య నిపుణుల సేవల కోసం ఉస్మానియా ఆస్పత్రికి, ల్యాబ్ లకు తిరగాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కోఠి ఈఎన్టీ ఆస్పత్రికి ప్రత్యామ్నాయంగా మరో హాస్పిటల్ ను అందుబాటులోకి తేవాలనే డిమాండ్లు రోగులు, వారి సహాయకుల నుండి వస్తున్నాయి.రోజు రోజుకు బ్లాక్ ఫంగస్ రోగులు పెరుగుతుండడం, ఈఎన్టీ ఆస్పత్రిలో ప్రత్యామ్నాయంగా వందల సంఖ్యలో మంచాలు పెంచే అవకాశం లేకపోవడంతో రోగులు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా మారాయి. ప్రతినిత్యం వందల సంఖ్యలో రోగులను మంచాలు లేవనే కారణంగా తిప్పి పంపుతున్నారు. కొంత మంది రోగులు ప్రతినిత్యం ఆస్పత్రి ఆవరణలోనే రోజులుగా ఎదురు చూస్తున్నారు. ఇలా వందల సంఖ్యలో రోగులు వస్తున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోగుల రద్దీకి తగ్గట్లుగా అదనంగా మంచాలను అందుబాటులోకి తేవాల్సి ఉండగా అధికారులు కేవలం 30 అదనపు పడకలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు.వర్షం నీరు వచ్చి చేరిందనే కారణంతో ఉస్మానియా ఆస్పత్రి పాత భవనాన్ని గత కొన్ని నెలలుగా మూసి ఉంచారు. ప్రస్తుతం ఈ భవనం ఖాళీగా ఉంది. భవనం మొదటి, రెండు అంతస్తుల్లో ఫ్లోర్ కు 300 చొప్పున 600 మంచాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఇందులో బ్లాక్ ఫంగస్ రోగులకు వైద్య చికిత్సలు అందిస్తే త్వరలో వ్యాధి అదుపులోకి వచ్చే అవకాశం ఉంది. ఈఎన్టీ ఆస్పత్రిలో భవనం, వైద్యులు, సిబ్బంది, ల్యాబ్ ఇలాంటి సమస్యలు ఉన్నాయి. ఇక్కడ అధికంగా మరో వంద పడకలకంటే ఎక్కువ ఏర్పాటు చేసే అవకాశం లేదు. దీనికితోడు ఎంఆర్ఐ, సీటీ స్కాన్ ల కోసం కూడా ఉస్మానియా ఆస్పత్రికి రోగులను పంపుతున్నారు.ఉస్మానియా నుండే మెడిసిన్, ఎండోక్రనాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ విభాగాల వైద్యులు ఈఎన్టీకి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో ఉస్మానియా పాత భవనాన్ని బ్లాక్ ఫంగస్ వ్యాధి అదుపులోకి వచ్చేంత వరకు అందుబాటులోకి తెస్తే సమస్యకు చెక్ పెట్టినట్లుగా ఉంటుంది. అంతేకాకుండా ఉస్మానియా ఓపీ, క్యూడీసీ భవనాలలో వైద్యం పొందుతున్న వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు.అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ పక్క నుండి ఉన్న గేటు ద్వారా బ్లాక్ ఫంగస్ రోగులు ఉస్మానియా పాత భవనానికి రావడానికి అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు అంతటా వ్యక్తమవుతున్నాయి.

# బీజేపీపై మరోసారి విమర్శలు గుప్పించిన శివసేన



ముంబై: దేశంలో కొవిడ్ తీవ్ర స్థాయిలో ఉన్నప్పటికీ భారతీయ జనతా పార్టీకి ఆవైపు ఏమాత్రం ఆలోచన లేదని, ఆ పార్టీ నేతల ఆలోచనంతా ఉత్తరప్రదేశ్ ఎన్నికల గురించేనని శివసేన తీవ్ర విమర్శలు గుప్పించింది. బుధవారం శివసేన అధికారిక పత్రిక సామ్నాలో రాసిన వ్యాసంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లపై దుమ్మెత్తి పోసింది."పశ్చిమ బెంగాల్‌లో ఓడిపోగానే భారతీయ జనతా పార్టీ నాయకత్వం ఉత్తరప్రదేశ్ వైపు చూపు కదిలించింది. మోదీ, అమిత్ షా, యోగి ఈ విషయమై రహస్య సమావేశవేశం నిర్వహించారు. దేశం మొత్తం కొవిడ్‌తో పోరాడుతుంటే బీజేపీ మాత్రం ఎన్నికలు నిర్వహించడం, భారీ ఎత్తున ర్యాలీలు చేపట్టడం, రోడ్‌షోలు నిర్వహించడం, ఎన్నికల్లో గెలవడం మీదే దృష్టి పెడుతోంది" అని సామ్నా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది.కొద్ది రోజుల క్రితం జరిగిన ఉత్తరప్రదేశ్ పంచాయతీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తగినంత ప్రభావం చూపలేకపోయింది. అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ దాదాపుగా సమాజ్‌వాదీ పార్టీకి చేరువలో ఆగిపోయింది. ఈ నేపథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తోంది. అయితే కొవిడ్ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం ఐదు అసెంబ్లీల ఎన్నికలు నిర్వహించి తీవ్ర విమర్శలకు గురైంది ఎన్నికల సంఘం. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి మేరకే ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చిందనే విమర్శలు కూడా వచ్చాయి.

# కరోనిల్ విజయవంతమవడంతో ఐఎంఏ, డాక్టర్లు తలక్రిందులయ్యారు : ఆచార్య బాలకృష్ణ



న్యూఢిల్లీ : పతంజలి ఆయుర్వేద్ అభివృద్ధి చేసిన యాంటీ కోవిడ్ కిట్ అద్భుతమైన విజయం సాధించడంతో అల్లోపతి డాక్టర్లు తలక్రిందులయ్యారని ఆ సంస్థ చైర్మన్ ఆచార్య బాలకృష్ణ అన్నారు. బాబా రామ్‌దేవ్ వ్యాఖ్యలను ఐఎంఏ, అల్లోపతి డాక్టర్లు రాద్ధాంతం చేయడానికి కారణం ఇదేనని పేర్కొన్నారు. బాబా రామ్‌దేవ్ కేవలం తనకు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌ను మాత్రమే చదివారని, డాక్టర్లను బాధిస్తున్నది స్వయంగా అల్లోపతియేనని చెప్పారు. జాతీయ మీడియా బుధవారం తెలిపిన వివరాల ప్రకారం, బాబా రామ్‌దేవ్ ఆధ్వర్యంలోని పతంజలి ఆయుర్వేద్ యాంటీ కోవిడ్ కిట్ కరోనిల్‌ను అభివృద్ధి చేసినట్లు ఆచార్య బాలకృష్ణ చెప్పారు. ఇది అద్భుతమైన విజయం సాధించడంతో అల్లోపతి డాక్టర్లు అయోమయంలో పడ్డారన్నారు. బాబా రామ్‌దేవ్‌పై అల్లోపతి డాక్టర్లు విమర్శలు చేయడానికి కారణం ఇదేనన్నారు. బాబా రామ్‌దేవ్ ఇప్పటికే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారని, అలాంటపుడు ఆయనను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం సరి కాదని అన్నారు. వందలాది మంది డాక్టర్లు సైతం అల్లోపతి ద్వారా నయంకానటువంటి వ్యాధులకు ఆయుర్వేద చికిత్స కోసం హరిద్వార్‌లోని బాబా రామ్‌దేవ్ ఆశ్రమానికి వస్తూ ఉంటారని తెలిపారు. ఆచార్య బాలకృష్ణ మే 24న ఇచ్చిన ట్వీట్‌లో, యావత్తు దేశాన్ని క్రైస్తవంలోకి మార్చే కుట్రలో భాగంగానే యోగాను, ఆయుర్వేదాన్ని అపఖ్యాతిపాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. యోగా రుషి రామ్‌దేవ్‌ను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా యోగాను, ఆయుర్వేదాన్ని అపఖ్యాతిపాలు చేస్తున్నారని మండిపడ్డారు. గాఢ నిద్ర నుంచి దేశ ప్రజలు మేలుకోవాలని, లేకపోతే రాబోయే తరాలు క్షమించవని హెచ్చరించారు. యోగా గురువు బాబా రామ్‌దేవ్‌కు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఉత్తరాఖండ్ డివిజన్ పరువు నష్టం నోటీసును పంపించింది. అల్లోపతి మందుల సామర్థ్యాన్ని ప్రశ్నిస్తూ ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. 15 రోజుల్లోగా లిఖితపూర్వకంగా క్షమాపణ చెప్పకపోతే, రూ.1,000 కోట్లకు పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించింది. బాబా రామ్‌దేవ్‌పై అల్లోపతి డాక్టర్ల ఆగ్రహానికి కారణం ఆయన అల్లోపతి సామర్థ్యాన్ని ప్రశ్నిస్తున్నట్లు ఓ వీడియోలో కనిపించడమే. 140 సెకన్ల నిడివిగల ఆ వీడియోలో ఆయన తన ఫోన్‌లోని సమాచారాన్ని హిందీలో చదువుతున్నట్లు కనిపించింది. "మొదట హైడ్రాక్సీక్లోరోక్విన్ విఫలమైంది. ఆ తర్వాత రెమ్‌డెసివిర్ విఫలమైంది, ప్లాస్మా థెరపీని ఇప్పుడు నిషేధించారు. స్టెరాయిడ్స్ విఫలమయ్యాయి. ఫబిఫ్లు, ఐవర్‌మెక్టిన్ కూడా విఫలమయ్యాయి" అని రామ్‌దేవ్ పేర్కొన్నారు. అయితే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ కఠిన పదజాలంతో లేఖ రాయడంతో బాబా రామ్‌దేవ్ క్షమాపణ చెప్పారు.

# ఆనందయ్య ఆయుర్వేద మందుని బ్లాక్ మార్కెట్ చేసిన వైసీపీ నేతలు

## -జనసేన పార్టీ నేత కేతంరెడ్డి వినోద్ రెడ్డి

నెల్లూరు నేడు దేశవ్యాప్తంగా ప్రజలు నెల్లూరు జిల్లా కృష్ణపట్నం ఆనందయ్య గారి ఆయుర్వేద మందు పైన ఆశలు పెట్టుకుని ఉంటే ఆ సంబంధిత సంస్థల చేత త్వరితగతిన అనుమతులు అయినా ఈ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని పంపిణీ జరిపించాలి లేదా దీన్ని ఓ నాటు ముందుగా అయినా పరిగణించి పంపిణీ బాధ్యత ఆనందయ్య గారికే వదిలేయాలని జనసేన పార్టీ నేత కేతంరెడ్డి వినోద్ రెడ్డి అన్నారు. ఓ ప్రక్క రాష్ట్ర ఆయుష్ సంస్థ ఈ మందు వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ నెల్లూరు సిటీ లోని ఆర్.ఆర్ క్యాటరింగ్ లో తయారు చేపించుకుని బకెట్లకు బకెట్లు తీసుకుపోతున్న వైనం దారుణం. ఒక మహోన్నత ఆశయంతో పేదలందరికీ ఉచితంగా ఆనందయ్య గారు ఇస్తున్న మందుని ఇలా తయారు చేయిస్తూ బ్లాక్ మార్కెట్ లో కాసులకు కక్కుర్తి పడి అమ్ముకుంటున్నారు. ఈ దుర్మార్గ చర్యలను జనసేన పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నానని అయన అన్నారు.

# నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలి

నందికొట్కూరు. మే 26 అఖిల భారత సంయుక్త మోర్చా పిలుపుమేరకు మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని సమన్వయ కమిటీ పిలుపు మేరకు బ్లాక్ డే నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పి వెంకటేశ్వర్లు డివిజన్ కార్యదర్శి గోపాలకృష్ణ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ తాలూకా నాయకులు మజీద్ మియా నిరసన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది బుధవారం నాడు నందికొట్కూరు పట్టణంలో ని పటేల్ సెంటర్లో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 26 నాటికి రైతుల ఉద్యమం ఆరు నెలలు పూర్తి అయిందని అదేవిధంగా నరేంద్ర మోడీ పరిపాలన ఏడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మే 26 నల్ల దినోత్సవంగా జరపడం జరిగింది మూడు నల్ల రైతు చట్టాలను రద్దు చేయాలని ఎన్ ఎస్ పి కి చట్టపరమైన హామీ ఇవ్వాలని ఎరువుల ధరలు తగ్గించాలని పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని సన్ ఫ్లవర్ ఆయిల్ నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలని కేరళ తమిళనాడు తరహాలో ఆంధ్రప్రదేశ్లో రేషన్ కార్డ్ ఉన్న ప్రతి ఒక్కరికి 7500 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు లేకపోతే రాబోయే కాలంలో దేశవ్యాప్తంగా మోడీని గద్దె దించడానికి వెనుకాడమని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు నాయకులు మౌలాలి రమేష్ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు కృష్ణ నరసింహ మా భాష ఉ పేంద్ర రైతు సంఘం నాయకులు మౌలాలి ఇస్రాయిల్ మహిళా సంఘం నాయకురాలు ఎస్ బి బి ఐ స విద్యార్థి సంఘం కార్యదర్శి గణేష్ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు

# జగన్ రెండేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం: ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

అమరావతి: ఆంధ్ర రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి రెండేళ్ల పరిపాలనలో అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ విమర్శించారు. కేవలం 5 వేలు, 10 వేలు డబ్బులు ఇచ్చి దాన్నే అభివృద్ధి అనుకోవడం జగన్ రెడ్డి అవివేకమన్నారు. ఒక చేత్తో సంక్షేమం అంటూ డబ్బులు ఇస్తూ, దానికి రెండింతలు అధిక పన్నుల భారం ప్రజలపై వేస్తూ డబ్బులు వసూళ్లు చెయ్యడం నిజం కాదా అని ప్రశ్నించారు. ఇసుక మాఫియా, మద్యం మాఫియాలని జగన్ రెడ్డి పెంచి పోషిస్తూ బినామిలకు వేల కోట్లు దోచి పెడుతూ రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచేస్తున్నారని ఆయన ఆరోపించారు. పేదలకు ఇళ్లపట్టాల పేరుతో ఒక సెంటు భూమి ఇస్తున్నామని చెప్పి, రాష్ట్ర వ్యాప్తంగా జగన్ రెడ్డి మంత్రులకు, ఎమ్మెల్యేలకు కోటాను కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించిపెట్టారని దుయ్యబట్టారు.ఆంధ్ర రాష్ట్రంలో కరోనా బాధితుల పరిస్థితులు చూస్తుంటే ఏమి చెయ్యలేని నిస్సహాయ స్థితిలో తమ ప్రజా ప్రతినిధులం ఉండవలసి వస్తుందన్నారు. కరోనా వలన ఆంధ్ర రాష్ట్ర ప్రజల దుస్థితి చూసి శాంతా బయోటెక్ వరప్రసాద్ రెడ్డి సైతం దుఃఖం వస్తుంది అని బాధపడుతుంటే, జగన్ రెడ్డికి మాత్రం చీమైనా కుట్టినట్లు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం జగన్ రెడ్డి చేతకాని, అనుభవం లేని పరిపాలన వలన రాష్ట్రం మారణహోమం లాగా తయారైందని రాజేంద్రప్రసాద్ విరుచుకుపడ్డారు.

# శ్రీ కపిలేశ్వరాలయంలో శాస్త్రోక్తంగా పత్ర పుష్పయాగం

తిరుపతి మే 26 తిరుపతి శ్రీ కపిలేశ్వరాలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా పత్ర పుష్పయాగం బుధవారం శాస్త్రోక్తంగా జరిగింది. కోవిడ్ – 19 వ్యాప్తి నేపథ్యంలో ఈ ఉత్సవాన్ని ఆలయంలో ఏకాంతంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉదయం 8 నుండి 10 గంటల వరకు శ్రీ కపిలేశ్వర స్వామివారు, శ్రీ కామక్షి అమ్మవారి ఉత్సవర్లకు నవ కలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పంచామృతాభిషేకం, చెరుకు రసం, కొబ్బరినీళ్ళు, విబూది, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పత్ర పుష్పయాగ మహోత్సవం జరిగింది. ఇందులో చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, జాజి, రోజా, తామర, మల్లి, వృక్షి, కనకాంబరంలతో పాటు బిల్వ పత్రం, తులసి, పన్నీరు ఆకులతో స్వామి, అమ్మవార్లకు పత్ర పుష్ప యాగ మహోత్సవం నిర్వహించారు. లోక క్షేమం కొరకు, ఆలయంలో అర్చక పరిచారకుల వల్ల, అధికార అనధికారుల వల్ల, భక్తుల వల్ల ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పత్ర పుష్పయాగం నిర్వహిస్తారని అర్చకులు తెలిపారు.

# హోటల్ వ్యాపారంపై కరోనా దెబ్బ




## కర్ఫ్యూ కారణంగా పడిపోయిన అమ్మకాలు
## వర్కర్లకు జీతాలు ఇవ్వలేక యజమాన్యాల ఆందోళన

గుంటూరు,మే26( విభారె) : కొవిడ్ ప్రభావం హోటల్ రంగంపై పడింది. కరోనా పుణ్యమా అని గత ఏడాది నుంచి హోటల్ రంగంపై ఆధారపడి జీవించే కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. కొవిడ్ సెకండ్ వేవ్ పుణ్యమా విధించిన కర్ఫ్యూ సమయాలు హోటళ్ల పాలిట శాపంగా తయారయ్యాయి. కర్ఫ్యూ భోజన హోటల్స్, ఫాస్ట్ ఫుడ్స్ నిర్వహకులను దారుణంగా దెబ్బతీస్తోంది. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్ర మే కర్ఫ్యూ సడలింపు ఉండటంతో భోజన హోటల్స్ నిర్వ హణ కష్టంగా మారింది. సాధారణంగా మధ్యాహ్నం 1 గంట సమయంలో జనం భోజన చేసేందుకు హోటళ్లకు వస్తుంటారు. కర్ఫ్యూ కారణంగా గంట ముందే అంటే 12 గంటల కల్లా హోటళ్లు మూసేయాల్సి వస్తుంది. సాయంత్రం వేళల్లో నిర్వహించే నూడిల్స్, పానీపూరి బండ్ల నిర్వహకులపై కొవిడ్ ప్రభావం కొట్టిచ్చినట్లు కనపడుతోంది. రాత్రి వేళల్లో భోజన హోటళ్లలో ఎక్కువ వ్యాపారం ఉంటుంది. ఆ సమయంలోనూ కర్ఫ్యూ కారణంగా అవి మూసేయాల్సి వచ్చింది. గుంటూరు నగరంలో పెద్ద ఎత్తున్న భోజన హోటళ్లు బిర్యానీ సెంటర్లు ఉన్నాయి. అలాగే పట్టణంలో పేరొందిన భోజన హోటళ్లు ఉన్నాయి. వాటి ద్వారా ప్రతి రోజూ లక్షల రూపాయల వ్యాపారం నడిచేది. ప్రస్తుతం ఎక్కడా హోటల్స్ తెరిచి ఉంచే పరిస్థితి లేదు. వారి యజమానులతో పాటు పని చేసే కార్మికుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ఇవే కాక కర్రీ పాయింట్లు, నూడిల్స్ బండ్లు నడుపుకునే వారు, డాబాల నిర్వాహ కులకు కూడా బతుకు భారంగా తయారైంది. గత నెల రోజులుగా హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ బండ్లు, కర్రీస్ పాయింట్స్, నూడిల్స్, పానీపూరి బండ్లు మూత పడటం గమనార్హం. ప్రభుత్వం కర్ఫ్యూను ఉదయం 6 గంటల నుంచి కాకుండా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సడలిస్తే ఊరట లభిస్తుందని, కనీసం భోజనం పార్సిల్స్ అయినా అమ్ముకుంటామని హోటల్స్ నిర్వాహకులు కోరుతున్నారు.

# స్వీయ నియంత్రణతోనే కరోనా కట్టడి
## కలెక్టర్ ఇంతియాజ్

విజయవాడ,మే26)( విభారె) : స్వీయ నియంత్రణతోనే కరోనా వైరస్ వ్యాప్తిని కట్టడి చేయడం సాధ్యమవు తుందని కలెక్టర్ ఇంతియాజ్ అన్నారు. ప్రజలు నిబంధనలు ఉల్లంఘించడం వల్లనే అదుపు తప్పుతోందని అన్నారు. మాస్కులు దరించడం, భౌతిక దూరం పాటించడం తప్పనిసరి కావాలన్నారు. కరోనాపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల్లో కరోనాను అరికట్టడంలో రాష్ట్రంలోనే జిల్లా ముందుందన్నారు. అందుకు కృషి చేసిన అధికారులను ఆయన అభినందించారు. కరోనా కట్టడికి ప్రధానంగా ప్రజలు భౌతికదూరం పాటించటంతో పాటు, తప్పని సరిగా మాస్కులు ధరించాలన్నారు. కరోనా వ్యాప్తి చెందకుండా ప్రభుత్వ అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు ప్రజలకు తమ వంతు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాక్సినేషన్ కార్యక్రమంలో 45 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు.

# అగనంపూడి శ్మశానవాటికలో బ్లీచింగ్ పిచికారి
## 79 వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

విశాఖపట్నం జీవీఎంసీ 79 వ వార్డు పరిధి అగనంపూడి బరియల్ గ్రౌండ్ (స్మశాన వాటిక) .పిచ్చి. మొక్కలు తో చాలా అధ్వాన స్థితిలో ఉండేది దీనిపై స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ దృష్టికి గ్రామ ప్రజలు తీసుకెళ్లగా వెంటనే స్పందించి జీ.వీ.ఎం.సీ అధికారులతో మాట్లాడి బుధవారం జెసిబి తీసుకొచ్చి దగ్గరుండి అక్కడ పనులను పర్యవేక్షించారు. తన సొంత నిధులతో బ్లీచింగ్ పౌడర్ కూడా తీసుకొచ్చి శానిటరీ సిబ్బందికి ఇచ్చి ఏరియా మొత్తం పిచికారి చేయమని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ మామిడి నాయుడు మామిడి నర్సింగరావు యల్లపు సాంబశివరావు వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లెమన్ టీతో అద్భుత ప్రయోజనాలు..!




ఒక కప్పు బలమైన టీ చాలా మంది ప్రజల జీవితంలో ఒక భాగం. ఒక కప్పు టీ ఏదైనా సందర్భాన్ని ప్రత్యేకంగా చేస్తుంది. టీ ప్రపంచంలో బాగా ఇష్టపడే అనేక రుచులను కలిగి ఉంది. వాటిలో లెమన్ టీ అత్యంత ముఖ్యమైంది. లెమన్ టీ చేయడానికి బ్లాక్ టీలో కొద్దిగా నిమ్మరసం పిండి, రుచి కోసం చక్కెర, సుగంధ ద్రవ్యాలు జోడించవచ్చు. పశ్చిమ బెంగాల్ వంటి భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజలు నిమ్మ టీకి నల్ల ఉప్పును కలుపుతారు. మీరు అప్పుడప్పుడు టీ తాగడానికి ఇష్టపడే వ్యక్తి అయితే ఈ ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకొని క్రమం తప్పకుండా నిమ్మకాయ టీ తాగవచ్చు. రోగనిరోధక శక్తిని పెంచడానికి నిమ్మకాయలో విటమిన్ సి, విటమిన్ బి 6, పొటాషియం మరియు మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. మీ రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి ఇవి సహాయపడతాయి. అలెర్జీలు, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడంలో ఇవి ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. టీ ఆకులలో ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇవి సహాయపడతాయి.నిమ్మకాయలో రక్తస్రావం గుణాలు ఉంటాయి ? చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి ఇది సూపర్ ఫుడ్. ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. మీరు దీన్ని పానీయంలో కూడా తీసుకోవచ్చు. మొటిమలు, తామర వంటి చర్మ వ్యాధులను నియంత్రించడంలో నిమ్మకాయ టీ సహాయపడుతుంది. ఇది మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.బరువును నియంత్రించడానికి ? నిమ్మకాయ టీ బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇది శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో సహాయపడుతుంది. ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది అనేక శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి.ఒత్తిడిని తగ్గించడానికి ? ఈ టీలో తగినంత ఫ్లేవనాయిడ్లు, పొటాషియం, మెగ్నీషియం, జింక్, రాగి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయి. ఒక కప్పు నిమ్మ టీ మీ మానసిక స్థితిని మెరుగుపరచడానికి, ఒత్తిడిని తగ్గించడానికి, మీకు ఎక్కువ విశ్రాంతి ఇవ్వడానికి సహాయపడుతుంది.ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థ ? ఆమ్లత సమస్యలు ఉండటం సాధారణం. దీన్ని నియంత్రించడానికి, మీరు నిమ్మకాయ టీని తీసుకోవచ్చు. ఇది కాకుండా మీరు పాలు లేని ఏ టీలోనైనా నిమ్మకాయను తీసుకోవచ్చు. దీనికి తగినంత ఫైబర్ ఉంటుంది. ఇది ప్రేగులను ఆరోగ్యంగా ఉంచడానికి పనిచేస్తుంది. ఇది జీవక్రియను ఆరోగ్యంగా ఉంచుతుంది.

# ఉనద్కత్పై బీసీసీఐ సెలెక్టర్ సంచలన వ్యాఖ్యలు




న్యూఢిల్లీ: దేశవాళీ స్టార్ ఆటగాడు, ప్రస్తుత రంజీ ఛాంపియన్ సౌరాష్ట్ర కెప్టెన్ జయదేవ్ ఉనద్కత్ కు సంబంధించిన సంచలన విషయాలను సౌరాష్ట్ర కోచ్ కర్సన్ గావ్రి వెల్లడించాడు. టీమిండియా తరపున టెస్ట్ మ్యాచ్, 7 వన్డేలు, 10 టీ20లు ఆడిన ఉనద్కత్ .. ఇకపై ఎప్పటికీ టీమిండియాకు ఆడలేడని, ఈ విషయాన్ని సాక్షాత్తు బీసీసీఐ సెలెక్టరే తనతో చెప్పాడని వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. 2019-20 రంజీ సీజన్లో ఏకంగా 67 వికెట్లు పడగొట్టి సౌరాష్ట్రను తొలిసారి ఛాంపియన్ గా నిలబెట్టిన 30 ఏళ్ల ఉనద్కత్ పై సెలెక్టర్లు ఇలాంటి అభిప్రాయాన్ని కలిగివుండటాన్ని ఆయన తప్పు బట్టాడు. వయసును బూచిగా చూపి ఉనద్కత్ ను జాతీయ జట్టుకు ఎంపిక చేయలేకపోవడమన్నది సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డాడు.రంజీ చరిత్రలోనే అత్యధిక వికెట్లు (ఒక సీజన్లో) సాధించిన ఆటగాడిని కనీసం భారత 'ఏ' జట్టులోకి కూడా తీసుకోకపోవడం బాధాకరమన్నాడు. దేశవాళీ క్రికెట్లో ప్రదర్శన తిరిగి జాతీయ జట్టులో స్థానం సంపాదించి పెడుతుందని ఉనద్కత్ ఎన్నో ఆశలు పెట్టుకున్నాడని, వాటిపై సెలెక్టర్లు నీళ్లు చల్లేలా ఉన్నారని విచారం వ్యక్తం చేశాడు. త్వరలో ప్రారంభం కానున్న ఇంగ్లండ్ పర్యటనకు ఉనద్కత్ ను ఎంపిక చేస్తారని తానూ కూడా ఆశగా ఎదురు చూశానన్నాడు. ఉనద్కత్ తన ఏకైక టెస్ట్ మ్యాచ్ ను 2010లో ఆడాడని, అప్పటి నుంచి జట్టులో స్థానం కోసం కఠోరంగా శ్రమించాడని చెప్పుకొచ్చాడు. ప్రస్తుత ఫాస్ట్ బౌలర్లలో షమీ, సైనీ, నటరాజన్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నారన్నాడు.

# ప్రభాస్ రాధేశ్యామ్ కోసం అక్కడ భారీ సెట్.. !



ప్రభాస్ పూజ హెగ్డే హీరోహీరోయిన్ లుగా నటిస్తున్న సినిమా రాధేశ్యామ్. ఈ సినిమాకు జిల్ ఫేం రాధాకృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తైనట్టు తెలుస్తుంది. అయితే సినిమా షూటింగ్ పూర్తయినప్పటికీ ఓ రొమాంటిక్ సాంగ్ మాత్రం మిగిలిపోయింది. ఇటీవల ఈ సాంగ్ షూటింగ్ కోంస షెడ్యూల్ కేటాయించి షూటింగ్ ను మొదలు పెట్టగా కరోనా కారణంగా బ్రేక్ పడింది. దాంతో కరోనా పరిస్థితుల వల్ల ఈ సాంగ్ ను షూట్ చేయకుండానే సినిమాను విడుదల చేయాలని మేకర్స్ భావించారట.అయితే ఈ సినిమా బాలీవుడ్ రైట్స్ ను సొంతం చేసుకున్న టీ సిరీస్ అందుకు నిరాకరించినట్టు సమాచారం.సినిమాలో పూజ ప్రభాస్ మధ్య వచ్చే ఈ సాంగ్ సినిమాకే హైలెట్ గా నిలుస్తుందని కాబట్టి ఈ సాంగ్ ను ఖచ్చితంగా చిత్రించాలని టీసిరీస్ సూచించిందట. దాంతో సాంగ్ ను చిత్రించేందుకు మేకర్స్ రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. అందుకోసం ముంబైలో ఓ భారీ సెట్ ను కూడా ఏర్పాటు చేస్తన్నట్టు టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉండగా ఈ సినిమాను పిరయాడికల్ ప్రేమకథగా తెరకెక్కిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా టీజర్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. దాంతో సినిమాపై కూడా భారీ అంచనాలున్నాయి. మరి ఆ అంచనాలను రీచ్ అవుతారా లేదా అన్నది చూడాలి.

# సుకుమార్ లెక్కలకు సమంత ఇలా సెట్ అయ్యిందా?




సమంత అక్కినేని.. హిట్ సినిమాలకు కేరాఫ్ గా ఈ అమ్మడు మారింది. 'ఏం మాయ చేసావే-గురించి లేటెస్ట్ అప్డేట్స్, ఫోటోలు, వీడియోల కొరకు వెంటనే క్లిక్ చేయండి. 'ఏం మాయ చేసావే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైనా ఈ ముద్దుగుమ్మ అప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్నో సినిమాలలో నటించింది. ఎన్నో అవార్డులను అందుకుంది. పెళ్ళికి ముందు ఒక లెక్క, పెళ్ళి తర్వాత లెక్క మాత్రం మాములుగా లేదుగా చిన్న హీరో నుంచి పెద్ద హీరో వరకు అందరి సినిమాలలో నటించింది. నాగ చైతన్య తో ప్రేమలో పడింది. అక్కినేని వారి కోడలుగా మరింత ఫేమస్ అయ్యింది.పెళ్లి తర్వాత, చై, సామ్ కలిసి నటించిన మజిలీ సినిమా భారీ హిట్ ను అందుకున్న సంగతి తెలిసిందే. ఇటీవల సామ్ నటించిన ఓ బేబి సినిమా ఎంత ఘనా విజయాన్ని అందుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే ఈమె ఏ సినిమా చేస్తే ఆ సినిమా మంచి టాక్ తో పాటుగా మంచి కలెక్షన్స్ ను అందుకోవడంతో ప్రతి ఒక్క డైరెక్టర్ సమంత సినిమా చేయడానికి క్యూ కడుతున్నారు. ఇది ఇలా ఉండగా సుకుమార్ కు మాత్రం సమంత మంచి పేరును అందించింది. వీరిద్దరి కాంబినేషన్ లో వచ్చిన సినిమా రంగస్థలం.. ఈ సినిమా లో పల్లెటూరి అమ్మాయి పాత్రలో సామ్ నటించింది.అలాంటి పాత్రలకు జీవం పోయాలంటే అది సమంతకు మాత్రమే సాధ్యం అనే రేంజు టాక్ ను అందుకుంది. ఈ సినిమాలో సమంతకు జోడీగా రామ్ చరణ్ నటించాడు. సుకుమార్ లెక్కలకు సమంత రీచ్ అయ్యిందనే వార్త ఇండస్ట్రీలో వినిపిస్తుంది. అలా సామ్ డైరెక్టర్ సుకుమార్ ఫేవరెట్ అయ్యింది. ప్రస్తుతం ఈ డైరెక్టర్ అల్లు అర్జున్ తో సినిమా చేస్తున్నాడు.. ఆ సినిమాలో రష్మిక కథానాయిక. చివరి దశ షెడ్యూల్ షూటింగ్ ను పూర్తి చేయాల్సి ఉంది. త్వరలోనే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. మరో వైపు సామ్ వెబ్ సిరీస్ లు సినిమాలతో బిజీగా ఉంది.




# సర్కారు వారి పాటలో కీర్తి సురేష్ రోల్ అలా ఉండబోతుందా ?

సూపర్ స్టార్ మహేష్ బాబు.. కీర్తి సురేష్ జంటగా నటిస్తున్న సినిమా 'సర్కారు వారి పాట'. ఈ చిత్రాన్ని డైరెక్టర్ పరశురామ్ పేట్లా తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే వీరి కాంబినేషన్ లో దుబాయ్ షెడ్యూల్ లో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్ లో జరగాల్సి ఉండగా.. కరోనా కారణాంగా షూటింగ్ నిలిచిపోయింది. తాజాగా ఈ సినిమాలోని కీర్తి పాత్ర గురించి ఓ ఇంట్రెస్టింగ్ అప్ డేట్ ఫిల్మ్ నగర్లో వినిపిస్తోంది.ఈ సినిమాలో కీర్తి సురేష్ పాత్ర చాలా హిలేరియస్ గా ఉంటుందని.. స్క్రీన్ టైం ఎక్కువగా ఉండటమే కాకుండా.. సినిమాకు కీర్తి పాత్ర హైలెట్స్ లో ఒకటిగా నిలుస్తుందని సమాచారం. అలాగే మహేష్, కీర్తి మధ్య వచ్చే కామెడీ సీన్స్ ప్రేక్షకులను బాగా అలరిస్తాయట. అయితే ఇప్పటి వరకు పరశురామ్ సినిమాల్లోని హీరోయిన్స్ పాత్రలు చాలా సీరియస్ గా ఉంటాయి. యువత, ఆంజనేయులు, సోలో, గీతగోవిందం వంటి సినిమాల్లో హీరోయిన్ పాత్ర సీరియస్ గా ఉంటుంది. కానీ ఈసారి సర్కారు వారి పాట సినిమాలో కీర్తి రోల్ మాత్రం చాలా ఫన్నీగా ఉండబోతుందట. ఇక ప్రస్తుత పరిస్థితులలో కాస్త మార్పు వచ్చాక షూటింగ్ తిరిగి ప్రారంభించనున్నారట. ఇప్పటికే 25 శాతం వరకు షూటింగ్ కంప్లీట్ అయ్యింది. ఈ మూవీని వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయనున్నట్లుగా చిత్రయూనిట్ ఇప్పటికే ప్రకటించింది. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా.. జీఎంబీ ఎంటర్టైన్మెంట్ ? 14 రీల్స్ ప్లస్ ? మైత్రీ మూవీ మేకర్స్ సంస్థలు కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.






# కాజల్ - పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన సినిమాలు ఏంటో తెలుసా ?



కాజల్ - పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన సినిమాల గురించి తెలుసుకునే ముందు వీరిద్దరి గురించి తెలుసుకుందాం.. కాజల్ అగర్వాల్ మొదట తేజ నిర్మించిన లక్ష్మి కళ్యాణం చిత్రం ద్వారా 2007లో, తెలుగు సినీ ఇండస్ట్రీలోకి అరంగేట్రం చేసింది. ఇందులో కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత కాజల్ 2009లో చిరంజీవి తనయుడు రామ్ చరణ్ తో రాజమౌళి దర్శకత్వంలో మగధీర చిత్రంలో నటించింది. ఇక ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించడంతో ఓవర్నైట్ లోనే కాజల్ స్టార్ హీరోయిన్ లిస్టులోకి చేరింది. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించి తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది కాజల్.ఇక పూరీ జగన్నాథ్ సినిమాలను దర్శకత్వం చేయడానికి అవకాశాల కోసం వెతుకుతున్న సమయంలో, పవన్ కళ్యాణ్ "బద్రి" సినిమా ద్వారా అవకాశం ఇచ్చాడు. ఈ సినిమా సూపర్ హిట్ అవడంతో పూరి జగన్నాథ్ డైరెక్టర్ గా మంచి స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఇలా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఎన్నో చిత్రాలు మంచి విజయాన్ని అందుకున్నాయి అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.ఇదిలా ఉండగా ఇప్పుడు కాజల్ అగర్వాల్ - పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన సినిమాలు ఏంటంటే, 2012 లో బిజినెస్ మ్యాన్ చిత్రం. ఈ చిత్రాన్ని ఆర్ ఆర్ మూవీ మేకర్స్ పతాకంపై, ఆర్ ఆర్ వెంకట్ నిర్మించాడు. ఇందులో ప్రకాష్ రాజ్, సూపర్ స్టార్ మహేష్ బాబు, కాజల్ అగర్వాల్, నాజర్ ముఖ్య పాత్రల్లో నటించారు. 2012 జనవరి 13న భారీ ఎత్తున విడుదలైన ఈచిత్రం, సంచలనాత్మక విజయాన్ని సాధించింది.ఇక వీరిద్దరి కాంబినేషన్ లో మరొక చిత్రం టెంపర్. జూనియర్ ఎన్టీఆర్ కెరియర్ పీక్స్లోఉన్నప్పుడు కాజల్ హీరోయిన్ గా, పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం టెంపర్. ఇక ఈ సినిమా ఎన్టీఆర్ కెరియర్ నే మార్చిందని చెప్పవచ్చు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190